ఆర్తి

ధనుర్మాసం, ఉదయంవేళ, మర్నాడే భోగి. నాలుగైదు పెద్దిళ్లు తప్పితే పూర్లో సున్నాలక్కూడా కరువైనట్టుంది. పూరికీ, మాలపేటకీ మధ్య పచ్చని వ్యవసాయాలుండేవి. ఈ యేడు ఎండిపోయిన గుమ్మడి పాదొక్కటి కనపడు తోంది.

మాలపేటలో వాకిట రెండు చదరపు గజాల ఎండ వుంటే, అందులో కూర్చున్నాడు పైడయ్య. అతనిచుట్టూ అన్న పిల్లలు కూర్చున్నారు. పెద్దన్న ముఖం కడిగి, సూర్నారాయణ మూర్తికి దండం పెట్టుకుంటున్నాడు. వాళ్ళ కెదురుగా అల్లంత దూరంలో ఎర్రెమ్మ నించొని వుంది.

"అయితే అంతే నట్రయ్యా!" అంది పైడయ్య నుద్దేశించి ఎర్రెమ్మ.

ఎర్రెమ్మకు నలభైయేళ్ళుంటాయి. కాలం విసిరిన గాడ్పులకు ఆర్చుకుపోయి యాభయ్యేళ్ళు పైబడ్డదానిలా వుంది. ఆమె అల్లుడికేసి సూటిగా చూస్తోంది. అల్లుడు వంచిన తల ఎత్తడం లేదు.

"కాదు, నీకూ అదే బోదా – అయితే సెప్పు, నానెలి పోతాను" అంది మళ్ళీ.

గొంతు చేతనైనంత సున్నితంగా మార్చుకొని అన్నదామాట. ఎర్రెమ్మ అలా సాత్వికంగా మాటాడగా పైడయ్య వినలేదు!

పైడయ్యకు నిండా పాతికేళ్ళుండవు. పట్నం వెళ్ళేక కొంచెం పొడుగెదిగి నట్టున్నాడు. మనిషికి తేటొచ్చింది. కొత్త కట్ బనీను తొడిగి, గీరల సిల్కు లాగు వేసుకున్నాడు. చుట్టూవున్నఅన్న పిల్లలు దిస మొలలతో, బోడిగుళ్ళతో, నల్లని మొహాలపై తెల్లని చారికలతో, కాకులక్కూడా ముద్దురాని కాకిపిల్లల్లా వున్నారు. అయినా "పొట్టలు బాగా పూదుతున్నాయి. వుండ్ర ముక్కల్లా వున్నారు" అనుకుంది ఎర్రెమ్మ.

పైడయ్య మాటాడలేదు. ఆర్చుకపోయిన ఆమె పాదాల వంకా, వంకర తిరిగిన బొటనవేళ్ళ వేపూ చూస్తూ వుండిపోయేడు. ఆమె వెనగ్గా – వేరుశనగ దిబ్బల కవతల – చాకళ్ళు రేవులకు తయారౌతున్నారు. ఆ పైన వూళ్ళో ఎవరి పనిమీద వారు హడావిడిగా వున్నారు.

"అయితే నానెల్దునా?" అన్నది గొంతు పెంచి.

ఈసారి బంగారమ్మ వూరుకోలేదు. అరుగులు మొత్తుతున్నదన్న మాటేగాని, ఆమె చెవులన్నీ యిటే వున్నాయి. జయ్యిన లేచి వచ్చింది –

"ఎల్దునా ఎల్దునా అని ఎవర్నోలమ్మ, అంత బెదిరిస్తావ్! నిన్ను మాఁవుబొట్టూ కాటికెట్టి పిలవొచ్చినాఁవే? నాను పిలవొచ్చినానా, నా కొడుకు పిలవొచ్చినాడా? ఎవరు పిలవొచ్చినారని పారొచ్చినావు? ఆనాడేఁవని కూసినా! నానూ, నా కొడుకూ ముమ్మారు నీ యింటి సుట్టూ తిరిగి నీ కడియాల కాలకి మొక్కిందాకా నువు గానీ నీకూతురుగాని, నా గుమ్మం తొక్కరన్నావా? మరిప్పుడు ఏ మొహఁ వెట్టుకొని పారొచ్చినావు? ముందు నువ్వొచ్చినావా, మాఁవొచ్చినాఁవా? సిగ్గుబొగ్గులైసుకొని నువ్వే మా గడపలడుగెట్టినావు. అయినా మాంయేఁవన్నాఁవూ? సరే, నీ పిలుపయ్యింది యెల్లన్నాం. వొచ్చిం దానివి వొచ్చినట్టెల్లాల. మీదు మిక్కిలి బెదిరిస్తావా? ఎవర్నోలమ్మ బెదిరిస్తావు?" అంటూ మళ్ళీ తన పనిలోకెళ్ళి పోయింది బంగారమ్మ.

బంగారమ్మ అంతతో వదిలినందుకు సంతోషించేడు పైడయ్య.

ఎర్రెమ్మ కూడా ఏ బుద్ధినుందో, అన్ని మాటలూ కిమ్మనకుండా పడింది. కొంత సేప్పొయ్యేక బంగారమ్మే అంది....

"అది నీ కూతురు – నీ రకతంలో రకతం! కాబట్టే నానత్తనైనా నా మాట తలాయించి నీ యెంట పారొచ్చింది. ఎంత అల్లుడైనా – ముందు నా కొడుకైనాగ్గదా – ఈడు నీ అల్లుడైనాడు. నీ కూతురికి నువ్వెంతో నా కొడుక్కి నేనంత కానా? చేతనైతే, తీసుకెల్లే నీ యల్లుణ్ణి – నానేం వొద్దన్ను!" అంది ఎత్తిపొడుపుగా.

అది పూడిగం మాటగా తీసుకొని ఎర్రెమ్మ పైయెత్తు యెత్తింది.

"అయితే కొడుక్కీ, కోడలికీ యిడబాపులెడతావేటే?"

"నా నిప్పుడెట్టడఁవేఁవి; నువ్వేనాడో ఎట్టేసినావు."

"అదే నా వుద్దేశఁవైన్నాడు నీ గుమ్మం తొక్కకనే పోదును."

ఎర్రెమ్మ మాట విసురుతోపాటు, చేయికూడా విసరడం చూసింది బంగారి. దాంతో ఆమె దడదడ చేయికడిగేస్తోంది.

మళ్ళా మొగుసుకుపోతారు కాఁవాల – అనుకుంటుండగా

"నువ్వుండొహె!" అని తల్లిని గత్తురుకొని, పెద్దన్నదమ్ముడు అరుగుమీంచి లేచొచ్చేడు. ఎర్రెమ్మ దగ్గిరికెళ్ళి బతిమాలుతూ అన్నాడు –

"ఎర్రెమ్మప్పా, నాన్నీ గెడ్డఁవట్టుకు బతిమాల్తాను – ఇప్పటికింటి కెలిపో. మాఁవైనా నీ మాట తోసేనేదు. ఆడికిష్టఁ

వైతే ఆడొస్తాడన్నాం. సిన్నోడూ సిటికోడూ కాదుకదా! – మెడలొంచి వుంచడానికీ, కసిరో కన్నెర్రచేసో తోల్డానికీ, ఆడంతటోడు ఆడు, ఆడికి తోసిందేదో తోసినట్టు చేస్తాడు. ఈ లోపున తెగిందాకా లాగితే, టుపీ మని పోతాది. నామాటిని నువ్వింటికెల్లు.”

నారాయుడు నిజగానే గెడ్డం పట్టుకున్నాడు – పుట్టి బుద్దెరిగాక ఇంతలా ఓడిపోలేదు ఎర్రెమ్మ, కోపం వచ్చి సర్రున మళ్ళిపోయింది.

అల్లంత దూరంపోయి, వెనక్కి తిరిగి పెద్ద గొంతుతో అరిచింది.

“ఒలే, వోలె బంగారి; ఓ లీపరాలో…. యియ్యపరాల! నానీనాడు సెప తన్నాను. నువు కొడుక్కీ, కోడలికీ యిడబావు లెడతన్నావు. అలా యెట్టినావో, యీ జలమలోనే కాదు – యేదేడు జలమలకి నువు పురుగులడిపోతావు. వొచ్చీ జల్మంలో నిన్ను కిందెట్టా మీదెట్టా – మంచానబడి కుళ్ళుసావు సస్తావు.

నానీనాడా దేవుడు సాచ్చిగా – ఆ సూన్నారాయణమూర్తి సాచ్చిగా – సెపతన్నాను. నువు పురుగులు గారి పోతావు. నా మాటినుకో” అంటూ పదిబార్ల కవతల – కొత్తవీధిలో తన యింటికేసి విసవిస పోయింది

“ఓ లెల్లే పత్తిత్త! శాపనాలెట్టొచ్చేవు. శాపనాలు! నీ శాపనాలకీ, నా శాపనాలకీ పట్టేవుంటే, యీ బూమ్మీజ్జనం ఎప్పుడో బుగ్గయిపోదురు.”

అంటూ వెక్కిరించింది. వెక్కిరించి, తన పని చూసుకోబోయింది బంగా రమ్మ.

★ ★ ★

ఆవిటికి సంకురాత్రి ఆర్నెల్లన్నారు. ఆర్నెల్లకోపాలి నా కూతుర్ని తీసికెల్తాను. నువ్వెంత అత్తవైతే మాత్రం అడ్డడానికి హక్కెక్కడుంది అంటుంది ఎర్రెమ్మ.

‘‘ఆవిటి’’ – అంటే రథోత్సవం. వాళ్ళుండేది పూర్వపుగంజాం జిల్లాలో. అక్కడి మనుషుల్లాగే ఆచారాలు కూడా – ఒరియా తెలుగుల కలగలపుగా వుంటాయి.

ఊళ్లో ఊళ్లోనే కదా – పండక్కో పున్నానికో ఎన్ని సుట్లు కావలిస్తే అన్ని సుట్లు తీసకెళ్ళూ నానడ్డనూ – ముచ్చటగా మూడురోజులుంచుకు పంపీ – అంటుంది బంగారి.

శా…. అదేం మాట. ఆర్నెల్లుకో పాలి ఆడపిల్లను తెచ్చుకోడం లోక రివాజు. అదీ ఆవిటికీ, సంకురాత్రికీ తీసికెల్తారు. వున్నవూరైతే వొక రివాజూ… పొన్నూరైతే ఒక రివాజూనా … రివాజులు మారడానికి వొల్లకాదంటుంది ఎర్రెమ్మ.

నీకు రివాజులే కావలిసన్నాడు పండుగ రేపనగా వొచ్చి తీసుకెళ్ళు. పండెగెళ్ళేక నెల్లాళ్ళు కావ్పొతే రెణ్ణెల్లుంచుకో నానడ్డను – అంటుంది బంగారి.

నానెప్పుడు తీసుకెల్లాలో సెప్పడానికి నువ్వెవత్తివి? ఎనక యీలైతే ఎనకుంచు కుంటాను. ముందు యీలైతే ముందు తెచ్చుకుంటాను. తెచ్చుకునే దాన్ని నా యిష్టంగాని, ఫలానా అప్పుడే తీసుకెల్లనడాన్కి నీకు రూల్సు లేవు. పొమ్మంటుంది …. ఎర్రెమ్మ.

వినేవాళ్ళు కూడా పంపడానికి ఒప్పుకున్నాక, ముందైతేనేం వెనకైతేనేం – అంటారు. ఆ తేడా యేవిటో బయటికి చెప్పుకోలేదు బంగారి. చెప్పుకోలేకే –

దాని మట్టుకది పురిటికెలిపోయి, దీనిమట్టుకిది పుట్టింటికెల్లి కూకుంటే, ముందు కోడలు మునుపే సొరగానికెల్లి కూకుంది గదా – ముసిల్దాన్ని ఈ గంపెడు సంసారం నా నొక్కత్తె నెత్తుతానా! అంటుంది.

నా కూతుర్ని దీని కొడుకుతో మనఁవడాని కంపినానా దీనింటి శాకిరి కిచ్చినానా? అని ఎదురడుగుతుంది ఎర్రెమ్మ.

పైడయ్య ఎక్కడో పట్నంలో కలాసీగా వుండిపోడం; ఎర్రెమ్మ వాదానికి మంచి పట్టిచ్చింది. అతడింటిదగ్గరే వుంటే, దాని మొగుడు దాన్నొగ్గి వుండనేడు – నా నేం సేతునూ? అనేది బంగారి.

పండుగ నెల్లాళ్ళుందనగా పిలవడానికొస్తే పెద్ద కయ్యం పెట్టేసింది.

పంపనని ఈమె – ఎలాగ పంపవో చూస్తానని ఆమె – చాతనైతే తీసుకెళ్ళని ఈమె – రాయే అమ్మి అని ఆమె – అటులాగా, యిటులాగా – వూరూ వాడా మూగిపోయేరు.

పాపం సన్నెమ్మ సిగ్గుతో చచ్చిపోయింది. కొంతసేపు అటూ యిటూ నలిగేక ఆమె మొర్రోమంటే ఇద్దరూ విడిచి పెట్టేసేరు. ఆ తరవాత వీరకత్తె లిద్దరూ జుట్లూ జుట్లూ పట్టుకొని, రక్కుకొని, కొరుక్కొని, రాళ్ళతో యుద్ధాలాడి, వాడ వాడంతా పోగై విడిపించేక విడ్దారు. అనువుకాని చోట కయ్యం పెట్టు కుందేమో, ఎర్రెమ్మకు కొంచం ఎక్కువ దెబ్బలే తగిలేయి. రక్తాలు కారుతున్న తల్లి – చుట్టూ మూగి మొర్రోమనే పిల్లలు – చూళ్ళేక సన్ని కూడా వాళ్ళతో వెళ్లింది.

“ఇదిగో, యిప్పుడు దానెంట యెల్లినావో, మరీ గడపల అడుగెట్టవ్” తెగేసి చెప్పింది అత్త.

★ ★ ★

ఆ సాయంత్రం తుమ్మల్చెరువు కళింగడా గట్టున ఆడపిల్లలు ముగ్గురు గరికెళ్ళు తవ్వుతున్నారు. అందులో ఒకతె ఈమధ్యనే పైట లేసుకుంటోంది. అక్కడికి రావడం అదే మొదటిసారిలా వుంది. చుట్టూ మహాసముద్రంలా వున్న

నిశ్శబ్దంలో వూపిరాడుతున్నట్టు లేదు.

"అవునే సన్నెమ్మా! ఇక్కడ్నుంచి కేకేస్తే వూరి కందుద్దా?" అంది తవ్వడం ఆపి నీలి.

"ఓల్నిన్నెవురు ఎత్తుకు పోరు నేయే"

– యీసడించింది అంకెమ్మ.

"నన్నెవలెత్తుకు పోతారు. ఎత్తుకుపోతే నిన్నెత్తుకు పోవాల – నేకపోతే మీ నేస్తురాల్నెత్తుకు పోవాల. వయసులో పిటపిట లాడుతున్నారా – సక్కగ అఁవురుతారు."

సన్నెమ్మ పకపక నవ్వింది.

'ఇదే టోలమ్మ పోకిరీ గుంట!'' అంటూ అంకి చీదరించుకుంది.

"ఊరు వూరల్లా వొగ్గీసి మీరీ మారుమూల కేలొస్తారో నాకు తెల్దేటి?" అంది నీలి.

అని –

"ఇక్కడికి కొత్తపేట దగ్గిరికాదా! పొద్దోయి జేసి నీ మొగుడో పాల నిన్ను సూడ్డానికొస్తాడు. అందుకూ!" అంది ముఖం పిట్టలా ముందుకు పొడుస్తూ.

అంకెమ్మా, సన్నీ పక్కులు చెక్కలయ్యేలా నవ్వుకున్నారు. కొంతసేపు పోయేక నీలి, మళ్ళా అడిగింది.

"నిబ్బగ సెప్పే సన్నెమ్మా! ఇక్కణ్ణుండి కేకేస్తే వూర్లో కందుతాదా?"

"ఏసి సూడే"

"అందక పోతేనో?"

"ఏ స్పూడన్నానా"

నీలి నిజంగానే నిలబడి వూరుకేసి చూసింది. కనుచూపు మేరలో ఎక్కడా మనిషి కనబడ్డం లేదు.

"ఎవర్ని కేకేతునూ!" అంది నీలి.

"దాలిగోణ్ని కేకెయ్,"

"నీలి, సన్నిమాట విననట్టు నటించింది. దాలిగాడంటే నీలి మొగుడు. నీలిని తొమ్మిదోయేట ఆ వూళ్ళోనే యిచ్చేరు.

నీలి గొంతెత్తి....

"ఓ.... రి పైడయ్ మాఁవో...." అంది గట్టిగా. అంకెమ్మ కిచకిచ నవ్వింది. సన్ని ముసి ముసి నవ్వుతూ –

"సాల్దు, ఇంకా గట్టిగా అరు అంది."

ఈసారి దమ్మంతా కూడగట్టి కేకేసింది నీలి –

"ఓ...రి పైడయ్ మాఁవో...?"

"ఓ....య్" అంది సన్ని – మామిడి తోపులో పిట్టలా.

"ఓ లెక్కిరించనక్కన్నేదు నేయే! నిబ్బగే వస్తన్నాడూ" అంటూ దబాయించింది నీలి. తరువాత, చవ్న కూచుండిపోయింది.

"ఓలమ్మ నిబ్బగే వొచ్చీసినాడే!" అంది గాభరా పడిపోతూ.

నీలి వరస చూడబోతేఁ పరాసికఁ వాడుతున్నట్టు లేదు.

"నిజవేనేటే?" అంది అంకెమ్మ.

"వొట్టోలమ్మ! కావలిస్తే నువ్ సూడు. తుమ్మల్తోపుదాటి గట్టెక్కుతుంటే, యెవురో అనుకున్నాను. గీర్ల కామీజూ, గూడకట్టూ. ఆ డీదునోకి బయలెల్తుంటె నాన్సూసినాను కానా? ఆడే!" అంది నీలి.

అంకెమ్మ యధాలాపంగా లేచినట్లు లేచి, పైడయ్య కనిపించగానే కూర్చుండి పోయింది.

"నిబ్బగేనే!" అంది సన్నితో.

సన్నెమ్మ తొణకలేదు బెణకలేదు.

"వస్తే రానియ్యే!" అంది నింపాదిగా.

అందిగాని, ఆమె గుండె దడదడ మంటోంది.

నిముషంలో తక్కిన ఇద్దరు కూడా పెద్ద తరహా కొచ్చేసేరు. కొంచెం సేపు ఆలోచించి –

"నువ్వుండు, మాఁవొస్తాం" అంటూ అంకెమ్మ గంప తీసుకు నిలబడింది. నీలికూడా గరికేళ్ళు దడదడ యెత్తేస్తోంది.

"మీరెల్లద్దు."

సన్నెమ్మ గొంతులో కచ్చె వినిపించగా, అంకెమ్మ కోపం తెచ్చుకుంది....

"బాగుందోలమ్మ మతోయిందే.... ఆలమ్మా మీయమ్మా తగువాడితే మద్దె ఆడేం జేసినాడు! వంటిమీద కేయుంచుకోయే" అంటూ మందలించింది.

మందలించి, నీలితోపాటు తాటిపెండెల్లోకి వొసిలిపోయింది.

సన్నెమ్మ ఎప్పట్లానే గరికేళ్ళు తవ్వుతోంది.

ఎదురుగా ఆగిన రెండు నల్లటి పాదాలను చూసేవరకు సన్నెమ్మకు గుండె గొంతులో కొట్టాడినట్టయింది. వణుకు పుచ్చుకుంటున్న చేతుల్ని వశంలోకి తెచ్చుకుంటూ, తత్తరపాటు కప్పిపుస్తోంది. కొంచెం సేపు చూసి – "తీరికై నాదా?" అంది కళ్ళయినా ఎత్తకుండా.

"దూరాబారం కావడాన కొందరికి తీరికుండదు సరే. కొందరికి ఎదర కొచ్చిన మనిషిని పలకరించడానికేనా తీరిక్కాదు; ఏటంటా?" అంటూ బట్టలు మట్టికాకుండా, గడ్డి కల చోటున చతికిలపడ్డాడు పైడయ్య.

పని ఆపకండానే ఒక్కసారి కళ్ళెత్తి దించేసుకుంది సన్నెమ్మ.

"నోరు మరి పెగల్దు" అన్నాడు పైడయ్య.

అయినా, సన్నెమ్మ నోరు పెగల్లేదు.

రంగు రంగుల గీరల సిల్కు కమీసు తొడిగి, తెల్లని ఇస్త్రీ మడత లుంగీ కట్టేడు పైడయ్య.

సన్నెమ్మ కట్టుకున్న రంగుకోక తెగమాసి అలుక్కుపోయింది. ఆ వేళే పులిమి కట్టుకున్నా, ఎన్నాళ్ళనుండో మాసినట్టుంది. ఆమె కుడిచేతికి ఒక రబ్బరు గాజూ, ఎడంచేతికి పూలుదారం వున్నాయి. అత్తింటేవుంటే, ఆ వేళప్పుడు అలా వుండే పరిస్థితి కాదు.

"నా సంతదూరం నుంచి వొచ్చినాను కదా – నీ నోట ఒక్క మాటంటే ముత్తేలు రాలిపోతాయా?" అన్నాడు పైడయ్య.

కట్టేందికి కోకల్లేకపోయినా, పెట్టకోడానికి నగల్లేకపోయినా అందంగా ఉండగల్దు సన్నెమ్మ. ఎంత పనున్నా, యింట్లో వొంట్లో బాగులేకపోయినా తలా, ఒళ్ళూ మాయనీయదు. ఆ సాయంకాలం నీరెండలో ఆరోగ్యంతో మెరసే ఆమె తేనె రంగు శరీరంమీద, తను తెచ్చిన ఎర్రంచు పసుపుకోకా, పచ్చరంగు పట్టుగాజులూ ఎలా ఉంటాయో చూస్తున్నాడు పైడయ్య.

"ఎన్నాల్లుంటా?" అంది సన్ని. తవ్విన మేరకి గరికేళ్ళమట్టి దులుపుతోంది.

"నీ దయంటే, యియాల్తో కలుపుకుని నాల్రోజులు. లేపోతే రేపే ఎత్తేస్తా నైండా".

"దయ" అన్నమాట కలుక్కున తగుల్తుందనుకున్నాడు పైడయ్య. కాని సన్ని నోట నిష్ఠూరాలేవీ రాలేదు.

"అసలేటి జరిగిందీ?"అన్నాడు పైడయ్య.

"ఏటి జరిగిందంటే, యేటని సెపుతాను. అంది సన్ని. ఆమె యింకా తలెత్తి చూడ్డం లేదు. కాని ముఖం వెనకటికన్నా పైకి లేచింది. గొంతులో ముందులేని వెచ్చదనం ఉంది.

"నీకు ఉత్తరాలు అందనే లేదా?"

"తగు వెలాగయ్యిందో సెపతారుగాని, ఎందుకొచ్చిందో సెప్పరు గదా!"

– పైడయ్య బెల్లిస్తూ అన్నాడు. ఉరుకలు పరుగులుగా తోసుకొచ్చే యెన్నో విషయాలు చెప్పేటట్టు కనిపించింది సన్ని. అంతలో మనసు మార్చుకొని గడ్డి తవ్వడం సాగించింది.

"ఎందుకొచ్చిందంటే నాకూ తెల్దు. ఒకేల తెలిసినా నాన్సెప్పటడం సబువు కాదు."

"ఉన్నమాట సెపితే సబువెందుక్కాదు!"

"ఒక్కాసి కనుక్కున్న తల్లి. ఇంకో కాసి కడుపులో ఎట్టుకోవలసిన అత్త. ఇద్దర్లో నానెవరికాసి మొగ్గినట్టున్నా తప్పే.

పైడయ్య యింకేవీ అనలేకపోయేడు.కొంతసేపు పోయేక–

"సరే, నువ్వంత అంటీ ముట్టనట్టు మాటాడితే నానేం సెప్పలేను."

"జరిగింది జరిగిపోనాదనడానికీ – యియ్యేల మళ్లీ కయ్యంవాయ్యింది. నా పని ముందెల్తె గొయ్యా, యనక్కెల్తే నుయ్యా లాగుంది. ఇప్పుడు నన్నెలాగ నడవ మన్నావో అదేనా సెప్పు" అన్నాడు పైడయ్య.

ఎంచేతో, దీనికి తప్పక జవాబు చెబుతుందనుకున్నాడు. కాని దీనికీ జవాబు లేదు. ఈసారి కోపం తెచ్చుకుంటూ అన్నాడు –

"అదీ సెప్పనంటే యిందులో నీక్కూడా మాయమ్మా మీదా, నామీదా కోపం ఉందనుకోవాలి."

"సన్నెమ్మ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగేయి. ఆమె తవ్వడం ఆపి గరికేళ్ళు గంప కెత్తుతోంది. చివర పరకలు కూడా గంపకెత్తేక, బొంగురుపోతున్న గొంతుకతో అంది:

"నీకెలా నడవాలటే అలా నడుస్తావు. ఇలాటివి – ఆడమనిషిని – నాన్సెప్పొ రాదు. నాన్సెప్పినా – ఆ సెప్పినట్టు నువ్ నడవారాదు" – అంటూ గంప చేతపట్టుకు నిల్చుండి పోయింది.

పైడయ్య కా మాటలూ, అంతకన్నా ఆమె లేచిపోవడం చాలా కష్టాన్ని కలిగించేయి. వచ్చిందగ్గర్నుండీ చూస్తున్నాడు. అన్నా, తల్లీ, ఆఖరికి పెళ్ళాం కూడా పెట్టిన్తగువు పెట్టేసి, "నీ యేడుపేదో నువ్వే యేడు" అంటున్నారు. తాను చెయ్యని తప్పుకి తనకే శిక్ష. దారినపోయే వాడైనా కష్టంలో దయ చూపిస్తాడు. సొంత మనుషుల అభిమానాలు ఇంతలా ఉన్నాయి. అతడు చప్న లేచిపోతూ అన్నాడు –

"సరే నాన్రేపొద్దున్నే బయలెల్లిపోతన్నాను – మల్లా ఈ వూరు మట్టీ తొక్కితే, మీరంతా నా పొగ సూసినట్టే" అని అక్కణ్ణుండి కదిలిపోయేడు.

కన్నీళ్ళతో సన్ని అక్కడే నిల్చుండిపోయింది.

విసవిస అడుగులు వేస్తుంటే, పైడయ్య కాళ్ళు దడదడ తేలిపోతున్నాయి. అక్కడికి వచ్చే ముందు కూడా అతడి గుండె ఈ విధంగానే గబగబ కొట్టుకు పోయింది. ఏఁవడుగుదాఁ వని వచ్చేడు? ఏఁవని వెళ్ళిపోతున్నాడు!

చేస్తున్నది తప్పు. తప్పు తప్పనిపించగా చప్పున వెనక్కి మళ్ళి సన్నికి దగ్గిరగా వెళ్ళేడు. వెళ్ళేక తాడి పెండెల మధ్యలో అంకెమ్మా, నీలి తమకేసి చూస్తూ కనిపించేరు.

కళ్ళనీళ్ళ పర్యంతమౌతూ అన్నాడు.

"మాపిటికి తవిటప్పగారింటికి ఓ పాలి రావా?"

"పైడయ్య గొంతు అతి దీనంగా వుంది. అది విన్నాక కాదనడ మెలాగో తెలియలేదు సన్నెమ్మకు. అయినా తప్పలేదు.

"నువ్వే మా యింటికి రా" అంది వంచుకున్న తలతో – రెండో పక్కకి తిరిగిపోతూ.

పైడయ్య యిహ ఆగలేదు. తిరిగైనా చూడకుండా వెళ్ళిపోతున్నాడు. మూణ్ణెల్ల కోసారొచ్చి మూడు రోజులుండి

వెళ్ళిపోతాడు. ఈ వరసని మూడే ళ్ళయి అతడక్కడా, ఆమె యిక్కడా వున్నారు. సావాసికత్తెలు సమీపించేసరికి, ఆమె కళ్ళు తుడుచుకుంటూ అక్కడే కూర్చుండిపోయింది.

★ ★ ★

దీపాలవేళకి యింటికొచ్చింది సన్ని. బుట్టెకు సగానికైనా లేని గరికెళ్ళు చూసి –

"ఔనే ఓలమ్మి, ఆ యేలనగా యెల్లి పొద్దుకూకులా పడ్డపాటిదేనే?" అంటూ సతాయించింది ఎఱ్రెమ్మ.

మంజూరులో బొరిగ దాచడానికి వెళ్ళిన సన్నెమ్మ, ఒక్కసారి ఆవేశంతో వూగిపోయింది.

నాను నీ పంచను బాడిసరికానికి రానేదు. నిన్నూ, నీ పిల్లల్నీ సాపాటెట్టి మేపాలనీ రానేదు. నువు పిలిస్తే సుట్టరికాని కొచ్చినాను. నీ కష్టంగుంటే సెప్పు – ఇప్పుడెలిపోతాను.

– అంటూ దులిపేదామనుకుంది. ఆమె వంతు పొరుగింటి పెద్దమ్మ ఆ పని ఆరంభించింది.

"ఓ లూరుకోయె ముదినంజ! వూళ్ళో అల్లున్నెట్టుకొని, పిల్లను పాటుకు పంపిందాన్ని నిన్నే సూసినాను. ఏఁవేసంటె నోరుందని నీ దిలాసా. దాని మనసు కష్టవేఁటో, దాని కడుపులోబాదేటో అని కసింతైన ఆలోసించవు. ఓ పూట నాలుగ్గడ్డి పరికలు తక్కువైనాయని దెప్పొచ్చినావు" అని కసిరింది.

నరసమ్మ యే వరసను చూసినా ఎఱ్రెమ్మకన్నా పెద్దది. ఆమె కొక్కదానికే ఎదురు చెప్పదు ఎఱ్రెమ్మ.

"నా నేటన్నానోలమ్మ! పరకలు తక్కువైతే, వొళ్లే నొచ్చిందో, కాలే నొచ్చిందో – యేఁవే పరకలు తక్కువయ్యేయన్నాను. నా రాత తిన్నగా నేక – నా మాట తిన్నగ రాదు. అంతేగాని నానిప్పుడేం తప్పు మాటన్నేదు.'' అంటూ యింట్లో కెళిపోయింది.

ఆమె వెళ్లాక నరసమ్మ సన్నిని పిల్చింది. దగ్గిరకు రానిచ్చి–

''ఔనే నీ మొగుడటుకాసి వొచ్చినాడన్నారు – కనపడ్డాడా?" అంది గొంతు తగ్గించి.

మనిషికన్నా ముందు, మనిషి కబురే పేటలోకి రావడం కొత్తకాదు. అంచేత సన్నెమ్మ ఆశ్చర్యపోలేదు.

"ఆనకొచ్చి సెపతాను – "అంటూ ఇంట్లోకెళిపోయింది.

ఆనకా రాక, ఆ తరవాతా రాకపోతే జాఁవు రాత్తిరికి – నరసమ్మే సన్ని దగ్గిర కెళ్ళింది.

ఆపూట, రోజులా సన్నెమ్మ వంటకు చేరుకోలేదు. దీపాలు పెట్టేక దిన వెచ్చాలక్కూడా తల్లే వెళ్ళింది. సందెవేళ దాటనిచ్చి ఇంట్లో గోనె గుడ్డ పరుచుకు పడుకుంది సన్ని.

దరిమిలా లేచిన మాలపేటలో, ఆ యిల్లు ఉత్తరపు వాసలో ఉంది. మూడేసి యిళ్ల వాసలు రెండుచేరి, కొత్త వీధయ్యింది. కొత్తవీధికీ, పేటకీ మధ్య ఒక పోగ పాడుంది. వాటికీ, వూరికీ మధ్య నారుమళ్ళూ. కూరమళ్ళూ ఉన్నాయి.

భూఁవికి మూరడెత్తున ఉండే వీధి ముంజూరు కింద, ఎఱ్రెమ్మ వంట చేస్తుంది. పొయ్యికి – ఓ చిన్న పిట్టగోడ చాటు.

సన్నెమ్మ పడుకున్న ఆ చిన్న గదికి, వీధివేపేగాని పెరటివేపు గుమ్మం లేదు. రాత్రుళ్ళు సన్నీ, ఆమె ఆరుగురు చెల్లెళ్ళూ అందులోనే పడుకుంటారు. ఎఱ్రెమ్మ వంట పొయ్యి దగ్గర కొంచెం చోటు చేసుకుని పడుకుంటుంది. మిగిలిన పంచ – ఉబ్బస రోగి మంచానికి సరిగ్గా సరిపోతుంది. ఆమె పెనిమిటి తెల్లార్లూ ఉబ్బసంతో జాపోస్తూ ఉంటాడు. ఎఱ్రెమ్మ పక్క నుండి తిడుతూ, ఓదారుస్తుంటే అతడికి పొద్దు పోతుంది.

జాఁవు రాత్రకి వంట చేసి, పిల్లలకూ, మొగుడికీ తినబెట్టింది ఎఱ్రెమ్మ. సన్నిని లేపితే ఆకల్లేదంది. ఎక్కడి చట్టి అక్కడే వుట్టి కెక్కింది. తలుపు చేరే సుకు వెళ్ళిపోయింది ఎఱ్రెమ్మ. ఆ తరవాత కొంత సేపటికి నరసమ్మ వచ్చింది.

"నా మాటిని నెగిసి మాయింటికి రా!" అంది నరసమ్మ రెక్కట్టుకు లేవదీస్తూ.

అంతవరకూ నిద్రపోని చెల్లెలూ, తండ్రీ ఈ వింత చూస్తున్నారు. సన్ని యిహ లాభం లేదనుకుంది.

నరసమ్మ సన్నిని తన ఇంట్లోకి లాక్కెళ్తుంటే, ఎఱ్రెమ్మ ఆయింట్లోంచి బయటికి వస్తోంది. లోపల నిద్రపోతున్న ఇద్దరు పిల్లలు తప్ప, మొగవాళ్ళెవరూ లేరు.

పొయిలో కుట్టు తీసి, కడవ సరిగా అవిఁర్చేక, వీధి గూట్లో దీపం తెచ్చి, గదిలో పెట్టింది నరసమ్మ పక్కన కూర్చుంటూ –

"నీకు నీ తల్లి ఎలాటిదో, నానూ అలాటి దాన్నే. నాను సెప్పే మాట సక్కగినుకో. కాపరాలు అగ్గయినా, బుగ్గెయినా, యిలాటి సందినీ మందినీ అవుతాయి. నా మాటిని, ఆడుసెప్పినట్టు నడు" అంది ముందుగా.

తన బతుకు యింత బజారు పాలయ్యిందా అని, సన్నెమ్మకు పట్టరాని దుఃఖం వచ్చింది. మొహాన చెంగేసుకుని ఏడుస్తోంది.

పక్క చూరులోంచి యేడుపు విని, ఎఱ్రెమ్మ బయటి కొచ్చింది. ఆ యింట్లోకి వెళ్ళడానికి తెగించలేకపోయింది.

"ఇప్పుడు నీ కొచ్చిన గండకత్తె రేటుందే? ఏడుపు దేనికింట?" అంటూ నిలేస్తోంది నరసమ్మ.

"నా బతుకిలా బజారు పాలైనది సరే, ఆడు ఏకాడికి దిగజారిపోనాడో సూడు. అడ్డమైనోళ్ళు దూరే గుడిసినోకి నన్నూ

రమ్మన్నాడు" అంది సన్ని.

"– కదా! ఆడంత వొల్లూపయీ కానకండ ఉన్నాడు కాబట్టే, నువు నీ జాగర్త మీదుండాల. ఇలాటప్పుడు నువ్వాసడ్డ సేస్తే, ఆణ్ణెవర్తో ఒకర్తి తన్నుకుపోదం ఖాయం. అందుకే, ఆడు సెప్పినట్టు నడవమంటాను."

సన్నెమ్మకీ మాటలు కొత్త దుఃఖాన్ని కలిగించేయి– – –

"ఏలా? – ఆడే మాయక్కడికి రారాదా?" అంది పొర్లుకొచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

అయితే అది అర్థం లేని మాటని సన్నీకి తెలుసు.

"ఎలాగొస్తాడే? మామానాడే ఆడు మీ యక్కడ తొంగుంది కుండనేదు, మీ యింటికి ఓ యిమ్మ, తెమ్మా? ఆ మాటకొస్తే, పందుల గుడిసే మెరుగు!" అంది నరసమ్మ.

కటువుగా వున్నా, నరసమ్మ మాటల్లో నిజం ఉంది. తొడుక్కోడానికి చింకి గుడ్డలేనా లేని పిల్లలు – ఈలికలూ వాలికలైన కోకముక్కలు కప్పుకొని, యెముకలు కొరికే చలితో ఆరుబయట పడుకోలేరు. ఒకళ్ళ మీదొకళ్ళు పడి పెద్దప్ప చుట్టూనో, తల్లి చుట్టో, ఆ గదిలోనే పడుకోవాలి. అంచేత పగలల్లా అత్తవారింట గడిపినా, రాత్రికి తమ ఇంటికి తీసుకుపోతాడు పైడయ్య సన్నిని.

"పోనీ! మా అక్కడ తొంగుంటారంటే – ఆ మద్దిన మీ గురించే యేదో అన్నానని మీ యత్తకి గుర్రుగుంది. ఇత్తెలిస్తే యింక నానూ అదీ జుట్లట్టు కోవాల."

సన్నికి యేదారీ కనిపించకపోగా, ముదుకుల్లో మొహం పెట్టుకు కూర్చుంది. కొంతసేపు పోయేక నరసమ్మే అంది.

"అందుకని, లేనిపోని ఆలోసెన్లు యెట్టుకోక, ఆడు సెప్పినట్లు సెయ్యి. ఉడుకు నీళ్ళెట్టినాను. యెచ్చగేసుకో: ఒక్కసిటం వోరిస్తే, కొప్పు గిప్పు దువ్వేస్తాను. ఆడక్కడికివస్తే; కబురు తెమ్మని మా కన్నిగాణ్ణి కాపలా యెట్టినాను! ఆడొచ్చీలోగా తయారైపో. వొచ్చాక, ఆణ్ణి తోడు తీసుకెళ్ళు. తిరొగొచ్చీటప్పుడు నీ మొగుణ్ణి తోడు తెచ్చుకో."

సన్నెమ్మకు కొంచెం సేపు అంతా నరిగానే ఉందనిపించింది. కాని యీ కబురు దాగదని తట్టగానే ఆమె గుండె మళ్ళా చెరువైపోయింది. దాంతో "నానక్కడి కెలాగెల్దునూ?..... యెల్లలేనో యెల్లలేను.....!" అని తల అడ్డంగా వూపుతూ, ఏడవసాగింది.

ఎన్నివిధాల చెప్పినా సన్నెమ్మ నచ్చుకోక పోవడంతో, నరసమ్మ విసిగి పోయింది.

"అయితే కాపరంలో నీళ్ళోసుకుంటావేటే?" అంది కసురుకుంటూ. సన్నెమ్మ తలెత్తలేదు.

"నీ మనసులో వుద్దేశంవేటో సెప్పు. ఇయ్యేల కాకపోతే రేపూ. రేపు కాపోతే యెల్లుండేనా ఆడే నీ పాదాల కాడికి రాడా, అని నీకుంది. మీ యత్త యేటంటుందో యిను?" అంటూ "ఔనే ఎర్రెమ్మ! యిలాగ రమ్మీ!" అని కేకేసింది.

ఎర్రెమ్మ వచ్చేక "కూకోయే" అని కసిరితే కూచుంది.

"దుక్కోళ్ళ కోడ లేటంటదే!" అంది నరసమ్మ.

"నువ్వే సెప్పు" అంటూ మొహం ప్రక్కకి తిప్పేసింది ఎర్రి.

"మీ యత్త, నిన్ను యింటికి రానీడాన్కి రెండు కండీసన్లెట్టిందట. రెండేల్లో, మూడేళ్లో – తన మనసుకు నచ్చి, తను అవునన్నదాకా – నువ్వు మీ పుట్టింటి గడప తొక్కనని మాటివ్వాల. అప్పుడయినా మీ యమ్మొచ్చీ తన వొల్ల పొర పాటయ్యిందని లెంప లేసుకోవాల.

ఆ రెండూ కాన్నాడు – తన బొందిలో జీవుడుండగా నీతో ఒక్క సూరుకింద నిలవనన్నాది. మీయత్తదెంత కిర్రపట్టో నీ కెరికే కదా! నీ పెనివిఁటయితేం, నీ బావలయితేం దానిమాట కెదురు నడలేరు. ఇప్పుడు సెప్పు కాపురం నిలబెట్టుకోడానికి మీ యత్త కాలు కింద దూరుతావా... ఆడు సెప్పినట్టు నడుసుకొని దాన్ని నిలబెట్టుకుంటావా?" అంది నరసమ్మ.

"ఆడు సెప్పినట్టు నుడుసుకుంటే మాత్రం – అత్త మనసు మారతాదేటి?" అంది సన్ని. ఆమె పలుకులో రోషం వుంది.

"ఏఁవో యెటుబోయి యెటొచ్చునో? ఆలుమొగు లేకఁ వయిన్నాడు అత్తకాదు గదా, దాన్నిపుట్టించిన జేజెమ్మయినా ఆ కాపరాన్ని ఇడదీయలేదు. లేన్నాడే టుంది! యేముండేనా యిడబావు లెట్టీగల్దు."

"అదే మీ ఉద్దేశమైతే నానసలెల్లను. నాకు, యామ్మా, బాబు, నా తోడ బుట్టువులెంతో; ఆ వంక మనుషులు ఆడికీ అంత. వొళ్ళెరపెట్టి ఆణ్ణి తెచ్చు కోడఁవైతే నా సేత కాదు."

సన్ని మాట పూర్తి కాలేదు అంతలోనే –

"సెప్పనేదా? నాన్సెప్పనేదప్పా?–" అంటూ ఉప్పెనలా లేచిపోయింది ఎర్రెమ్మ. "అదీ దానత్తా, దాని మొగుడూ, దాని అయినోళ్ళు కానోళ్ళూ – ఆళ్ళంతా వొక్కటే. నానొక్కదాన్నే పైదానిని. నా కూతురేదో నాలో కలిసిపోయి దాని పడుపూ, తుడుపూ అంతా నాకే యెట్టేస్తోందని లోకనింద! నిందొక్కటే నాకు దక్కినాది.

అడుగు. ఎప్పుడైనా దాని కూళ్లోగాని, నాల్లోగాని ఒక్క పైస.ఒక్క పైస్సుమీ –, నాగ్గాని, నా పిల్లలగ్గాని ఎట్టిందేఁవో – అడుగు. అడుగు ఎదురుగా అద్దవుంది. మొహఁ వుంది – దాన్నే అడుగు.

ఎంతసేపూ, ఆ ముదనష్టపోణ్ణి మేపుద్ది – పందిని

మేపినట్టు! ఒద్దే ఆడు సచ్చినా బతికున్నా ఒకటేనే! అంటే యినదు. ఆడికి పోస్తాది – సీసాలకి సీసాలు సారాలు. ఏఁ వేనంటే, శీతగాలి ఆడు కిరకిర సుట్టుకుపోతుంటే నాను సూళ్ళేనంటాది. ఆడియాల సస్తే రేపటికి రెండు. బతికేం బావుకోవాల? ఆడు బతికుంటే, ఆడికి శఁవ; యింటి యింటిల్లిపాదికి శఁవ; అలాటి సావోటి పోడికోసం బయలెల్లి, తగు వీకాడికి తెచ్చింది.

ఒద్దమ్మ! మీ యత్త, కింకపట్టు పడుతోంది – నాను పిల్సన్నాను. కాదు పిలుపుకిరా అంది.

ఒద్దమ్మ! యీ యేడు పంటలు పోనాయి – కోతలా, యేతలా అన్నాను. కాదు. రా! అంది.

యెల్లినాను. యెల్లినందుకి యేకీలు కాకీలు యిరిపించుకొని, నా్ౖరోజులు మంచవెక్కినాను.

నువ్వొచ్చి సేసిన వుద్దరింపేటీ? – నీకు పండుక్కి ఒక కోక్కయినా కూల్డబ్బులు మిగల్సనేదు. ఇదీ – నువ్ సేసిన వుద్దరింపు! ఇప్పుడు దీనికోసం నేనెల్లి దాని కాలుకింద దూరాల. లేకపోతే, కాపరం గంగలో కలుస్తాది. లోకమంత నా నోట్లో పూస్తారు. ఇదంతా నానెపుడో సేసుకున్న కరమ – పూరవ జల్మంలో నాన్సేసిన పున్నెం!"

అంటూ గట్టిగా నెత్తిన రెండు మొత్తులు మొత్తుకొని అక్కణ్నుంచి వెళ్ళి పోయింది ఎర్రెమ్మ.

గొప్పవాళ్ళలో – గొప్పవాళ్ళూ, చాలా గొప్పవాళ్ళూ, అతి గొప్పవాళ్ళూ వున్నట్టే; పేదవాళ్ళలో, కడు పేదలూ, నిరుపేదలూ వుంటారు. అందులో – ఎర్రెమ్మ కడుపేదది.

ఎర్రెమ్మకు, వాళ్ళుండే గుడిసొకటుంది. అందులో గట్టివి నాలుక్కుండ బొచ్చెలే కాక రెండు సిలవరి గళాసులూ, ఒక చిల్లుపడ్డ సిలవరి చెంబూ, తాకట్టుకు పనికిరాని లొత్తల తపేలా, పైగా రెండు కంచాలున్నాయి. అంచేత ఆమెను నిరుపేదల కోవలోకి చేర్చరాదు.

ఆమెతో తైపారేస్తే, బంగారమ్మ వొత్తి పేదరాలు మాత్రమే అవుతుంది. వాళ్ళింట్లో – సిలవరి సావేనే కాక, తాకట్టుకు పనికొచ్చే మూడు కంచు గిన్నెలున్నాయి. కోడళ్ళు, తెచ్చిన రెండు ఇత్తడి తబుకులూ, చిన్న ఇత్తడి బిందె వున్నాయి. బంగారమ్మ కాలానివి నాలుగ్గళాసులన్నాయి. ఇవిగాక స్థిరాస్తులు కూడా వున్నాయి.

వాళ్లకో ఎత్తరుగుల యిల్లుంది. దానికి పెరటికేసి గుమ్మం వుంది. ఆవైపు మంచం పట్టేపాటి ముంజూరు, ఆ వెనక చిన్న పెరడూ వుంది. సన్ని కాపరం కొచ్చేక, దాంచుట్టూ దడి వచ్చింది. అన్నిటినీ మించి (ఎంత మదుపు పెట్టినా నోరావులించే చూడిగేదెలాంటి) చిన్న బంజరు ముక్క వుంది.

అంచేతే, వాళ్లని "కలిగినోళ్లంటారు" చాలామంది.

బంగారమ్మ కాపరానికి వచ్చిన యేడాదికి వాళ్ళత్త వేర్లు పెట్టింది. ఐదారు బస్తాలు వడ్లు పండే పొలం: వేస్తే నాలుగు బస్తాలు వేరుశగయ్యే మెట్ట భూఁవీ – వీళ్ళ వాటాకి వచ్చేయి. రెక్కల కష్టం చేసుకునే యిద్దరు పడుచువాళ్లు, తిండి తప్పిస్తే గుడ్డక్కూడా దర్జాకింద జమకట్టే కూలిబతుకు. బతుకు తోసుకు పోడానికి సరిపోతుండేది.

తరవాత, వాళ్ళ కుటుంబం పెరిగింది. ఇంతలో యుద్ధం వచ్చింది. పంట లెప్పట్లానే పండుతూ, యెండుతూ వుండినా, ధరలు పెరగడం, సరుకులు దాచడం, బ్లేక్ మార్కెట్టూ కొత్తగా దిగేయి. ఆ వస్తువులే పూర్లోకొచ్చేసరికి వాటి ధరలు విపరీతంగా ఎదిగాయి. జనానికి అప్పులు చేయకా తప్పలేదు; అవి తీరేదారి లేక భూఁవులమ్మకా తప్పలేదు.

ఆ విధంగా, వెనకటి రాజ్జంలో చాలామంది పేదవాళ్ల భూఁవుల్తో పాటు వాళ్ళ భూఁవులూ చెల్లిపోయేయి. ఇంతో రాజ్జాలు మారి పోయేయన్నారు. యీసారి రాఁవ రాజ్జం వస్తందన్నారు. కొందరు – కాదు! మాలల రాజ్యం వొస్తోందన్నారు.

మాలలకి వుద్యోగాలు; మాలలకి ఇళ్ళు; మాలలకే బంజర్లన్నీ; మీ వాడే ఒకడు శాస్త్రాలు రాస్తన్నాడ్రా! – అన్నారు ఖావందులు.

అనడం, ఇనడఁవే తప్ప – యే బంజరు కాడికెళ్తె, ఆ బంజరు కాడె కర్రల్తో నిలబడేవారు కాపునాయుళ్ళు. ఎట్టకేలకు పూరికి ఆఁవడ దూరా న్నుండేవి; రాళ్ళూ, రాపాషాణాలతో – ఆ బండలు పిండిచేస్తే తప్ప సాగుకి కొరగానివీ! అక్కడొకటీ, యిక్కడొక్కటీ చిన్న చిన్న ముక్కలు తప్పితే మాలలకి దక్కింది లేదు.

కరణంగారి కాళ్ల చుట్టూ దక్షిణ తాంబూలాలతో ప్రదక్షిణలు చేసి చేసి, మునసబుగారి ముంగిట్లో నెలల తరబడి వెట్టి చాకీరిలు చేసుకుంటూ, మనువులూ, ప్రార్థనలూ చేయగా చేయగా, ఒక చెరువు గర్భంలో చారెడు ముక్క వొరకట్టుకోగలిగేడు బంగారి మొగుడు. ఆ యాడాదే, అతడికి కాలం నిండుకుంది. దాంతో అది అచ్చిరాలేదన్నారు. అయినా, బంగారి దాన్నొదల్లేదు.

అప్పటికి పిల్లలంతా – ఇంతా అంతావాళ్ళు. పెద్ద కొడుకు నారాయుడే కసింత జబరుగా వుండేవాడు. అతణ్ణి పెట్టుకొని బంగారి యజమానురాల య్యింది. అంతవరకూ చూసిన బతుకు నుండి ఆమె కొన్ని విషయాలు తెలుసుకుంది.

పేదవాళ్ళు పెద్దవాళ్లవడం ఎన్నటికీ జరగని మాట. లేని దానికోసం చేయిచాస్తే వున్నది పోవడం ఖాయం. నా్ౖరోజులు

పస్తులున్నా వాళ్ళ ప్రాణాలు పోవడం లేదు. ఆ మాత్రం దానికి వున్నది చేయిజారితే తిరిగి రాదు కదా!

అంచేత –

ముందు లేనిదానికోసం, ఇప్పుడు ప్రయత్నించను. ఇప్పుడున్నా దాన్ని ప్రాణాలు పోయినా వదిలిపెట్టను. అని గట్టిగా తీర్మానించుకుంది. ఆ తీర్మా నానికి బెత్తెడిటుగాని, జానెడటుగాని జరక్కుండా అమలు చేసింది. ఆమె హయాంలో పూచిక పుల్ల బయటికి పోలేదు.

ఇలాంటి నిష్టలు నెరవలేని తక్కిన మాలలు, వాళ్ల రాజ్జం వస్తోందని నమ్మి, చెంబూ గిన్నే అమ్మి, చెమటోడ్చి బంజరు సాగుకు తెచ్చేరు. కొత్తనీరొచ్చేది పాత నీరు కొట్టుకు పోడానికే కదా! – అందుకైన మదుపు కింద, అవి చెల్లి పోయేయి.

ఇప్పుడు వాళ్ళకున్న ఆస్తులల్లా, రెండే రెండు.

ఒకటి యిల్లు, రెండు వొళ్ళు.

మాలపేటలో ఇళ్ళు అగ్రవర్ణులు కొనరు. అవర్ణజులకు కొనే తాహతు లేదు.

అలానే ఒళ్ళు కొంచెం కొంచెం అప్పుడప్పుడు అద్దెకివ్వడాన్ని శాస్త్రమూ, శాసనాలూ అంగీకరిస్తాయి కాని దానవిక్రయ సర్వాధికారాలతో పూరా అమ్మడానికి అంగీకరించవు.

కాబట్టే వాళ్ళలో చాలామంది కడు పేదలుగానే వుండిపోతున్నారు. లేకపోతే యేనాడో నిరుపేదలవ్వవలసింది.

నలుగురు కొడుకులూ చేతికంది, యిద్దరు కోడళ్ళు వచ్చేవరకు, బంగారమ్మ కుటుంబం బాగానే వుంది. సీజన్లో నాలుగురాళ్ళూ, గింజలూ వెనకేసి సీజ నెళ్ళేక కాయా, కసరూ ఏద్దొరికితే దాంతో కాలం పుచ్చుతూ, అప్పు చెయ్యకుండా పొలంకి మదుపెట్టి, పండితే పండినంత తినేవారు; లేకపోతే లేదు.

ఇలా వుండగా, బంగారి మూడోకొడుకు మేజరయ్యాడు. కొత్త వయసులో బతుకుమీద రక్తీ, తమ శక్తియుక్తులమీద నమ్మకం వుంటాయి. దానికి తోడు పెళ్ళి కూడా అయ్యింది.

తల్లికి తెగువ లేదనీ, అది లేప్పోతే యెక్కడేసిన గొంగళి అక్కడే వుంటుం దనీ, గొణుగుడూ, సణుగుడూ ఆరంభించేడు.

మీ యిష్టవేఁటట అనుకోండీ. అప్పుమాత్రం తేదాని కొల్లకాదు. గట్లే యెత్తిస్తారో, గెత్తాలే పెరిగిస్తారో, సెరువు మన్నులే నడిపిస్తారో యిసకలు పరిపించి యెరువులే కొనిపోస్తారో, నూతులు తవ్వించి కూరాకులే పండిస్తారో ఏం సేసినా నాను కాదన్ను. మీ రెక్కల కష్టం ఏంచేసినా సెయ్యండి. నాకూ బోదే అనేది బంగారి.

పౌరుషపడ్డ పైడయ్య, అవకాశం కనబడగానే పట్నం వెళ్తానన్నాడు. ఓ! మహారాజులా గెళ్ళంది బంగారి: అనడమే తరువాయి, పట్నం వెళ్ళి పోయాడు పైడయ్య.

ఆర్నెల్లు కిందపడి, మీదపడి ఒక యేడాది గలగల్లాడేడు. ఆ తరవాత యెక్కడ యేఁవయ్యిందో తెలియదు. అతడి చేయీ కట్టయిపోయింది. ఈ రెండేళ్ళయీ – పైడయ్య గిజగిజలే కనబడుతున్నాయి గాని ఆ చెయ్యి సాగడం లేదు.

ఇక్కడకూడా పైడయ్య పట్నం వెళ్లిన యేడాదే పెద్దకోడలు పోయింది. మూడేళ్ళయి పంటలు సరిగా లేవు. పావూ, అరా, పూర్తిగా, పోతూ వచ్చేయి. దాంతో వూరునా, వాడనా బ్రతుకు భయం సెలలేసింది.

వర్షావసానాన వాగులుపుట్టి వరదలై పొంగినట్టు, వ్యక్తులలో పుట్టిన భయం, వెల్లువలై పొంగింది. గడ్డిమొక్కలు ముందు మునిగితే, గాలివానకి వృక్షాలూ, ఆముదపుచెట్లూ ఆ తరువాత విలవిల్లాడుతున్నాయి.

ఆ వుక్కిరి బిక్కిరిలో బంగారికి మతిపోతోంది.

ఎంగిలాకుల కోసం వీధికుక్కలు ఎందుకు చస్తాయో .... ఆ విస్తళ్ళలో భోజనం చేసినవారికి అర్థం కాకపోవచ్చు. ఏడాదిపాటు పేగులు మాడితే యెవరికైనా అందులో నీతి కనబడుతుంది;

ఆవిటికి ముందు గొప్పులూ, వేరుశనగల వేతా... నెల్లాళ్ళు కూల్లుంటాయి. ఆవిటి వెళ్ళేక మూడు నాలుగు వారాలగ్గానీ కూల్లు పుట్టవు.

పండుగ ముందు నెల్లాళ్ళు ముమ్మరంగా వరికోతలు. పండుగెళ్ళేక తొలకరిస్తే గాని బతుకుల్లేవు.

అందుకే పండుగ ముందు తీసుకెళ్తా నంటుంది ఎర్రెమ్మ. అందుచేతే, పండుగెళ్ళాక తీసుకెళ్ళమంటుంది బంగారి.

సన్నితో కలుపుకొన్నా... ఎర్రెమ్మ యింట ఇద్దరే ఆడకూలీలు. సన్నెమ్మ లేకపోయినా – బంగారి యింట నలుగురు మగకూలీలు, ఇద్దరు ఆడకూలీలూ వుంటారు.

అయినా, ఈ కరవు రోజుల్లో కోడల్ని వొదులుకోనంటుంది బంగారి.

★ ★ ★

మర్నాడుదయం చేదుమింగి, భోగినీళ్ళోసుకొని, పెద్దమ్మగారింటికి బయల్దేరాడు పైడయ్య.

"ఇప్పుడెందుకు? మద్దేనఁ వెల్తెకాదా?" అన్నాడు నారాయుడు తమ్ముడితో.

తిండికి వుండననీ: ఆ వేళకి వచ్చేస్తాననీ మాటయిచ్చాక సరే నన్నాడు నారాయుడు.

రాత్రి యెంతోసేపు నిద్రపోలేదు పైడయ్య. ఆ వుదయం కూడా అతడి మనసు సరిగాలేదు. తన గోడు ఎవరితోనయినా

చెప్పుకుంటే గాని తేలేటట్టు కనిపించలేదు.

పెద్దమ్మ వూరు.... అక్కడికి మైలున్నర దూరంలో ఉంది. చిక్కని కొబ్బరిచెట్ల నీడ మధ్యని యెత్తుగా దేవాలయం. పెద్దమ్మ యింట అతని నేస్తుడు కన్నయ్య వున్నాడు.

పెద్దమ్మ కూతుళ్ళలో పెద్దది పదిహేనేళ్ళక్రితం పోయింది. ఆమెకు ఒక్కడే కొడుకు కన్నయ్య. తల్లిపోయేక అతడు మేనమామల యింటే పెరిగాడు. పైడయ్యకూ, అతడికీ చిన్నప్పుడే జట్టు కుదిరింది. కన్నయ్యతో కొంతసేపు మాటాడితే మనసు తేలికౌతుందనుకున్నాడు పైడయ్య.

పైడయ్యను చూసి యింటిల్లిపాదీ దేవుడొచ్చినంత సంతోషించేరు. తాటి నార నేసిన యెత్తు పీటవేసి, ఆ చుట్టూ అందరూ కూర్చున్నారు. కన్నయ్య లేడంటే అర్జంటుగా కబురంపేరు.

అరముగ్గి, ఎంవుకలూ చర్మం మాత్రం మిగిలిన ముసల్ది యెప్పట్లాగే అరుగుమీద అర్థనగ్నంగా పండుకుంది. అరమగతలో తెలివొచ్చిందేఁవో –

"ఎవురు? ఎవురర్రా: ఎవురొచ్చినారు?" అంటూ పీలగా అరుస్తోంది.

పైడయ్య పెత్తల్లి, ఆమె దగ్గరకెళ్ళి గట్టిగా అరుస్తోంది –

"మా సెల్లెలి కొడుకు, మూడు... మూడో వోడు!" వేళ్ళు కళ్ళకి దగ్గిరగా పెట్టి చూపిస్తూ అరిచింది. ఈలోగా, పైడయ్య ఆమె దగ్గిరికెళ్ళి –

"నానే అవ్వ! నాను. నీ మునిమనవణ్నేడా కన్నయ్య – ఆడి నేస్తుణ్ణి"

అప్పటి కర్థమయింది ముసలమ్మకు. కొడగట్టిన కళ్ళు ఒక్కక్షణం తళుక్కు మనగా, నోరాలించి "ఆఁ...." అంది తలాడిస్తూ.

"పోల్సింది ముండ" అని నలుగురూ నవ్వుకున్నారు.

ముసలమ్మకి తెలిసినా తెలీకపోయినా – వాడ వాళ్ళందరికీ తెలిసి పోయింది. యెరిగిన వాళ్ళు ఒకరొకరే వచ్చి పలకరిస్తున్నారు. వచ్చిన వాళ్ళందర్నీ కూచోమంటోంది పెద్దమ్మ.

కుశల ప్రశ్నలయ్యేక.

"అక్కడెలాగుందిరయ్యా" అన్నారు భోగట్టా లారంభిస్తూ.

"ఎలాగంటె యేటి సెపతాను. ... యిలాగే" అన్నాడు పైడయ్య గొంతు సవరించుకుంటూ.

"కాదు.... రేసనింగన్నారు.... బియ్యాలూ గట్టా దొరకుతున్నాయా?"

"దొరుకుతాయి.... బ్లేకు మారకట్లో – డబిలీ సార్జీలిచ్చి కొనగలిగితే."

"ఇక్కణ్నాగే" అందో పెద్దవయసామె.

"కూల్లో?"

"అయీ యిక్కడ్నాగే. దొరికినాళ్ళకి దొరుకుతాయి. లేనోళ్ళకి లేదు."

తరవాత పైడయ్యవుండే పట్నం గురించి అడిగేరు. అతడుండే పట్నం శానా పెద్దది. ఇత్తల అగ్గురోరం అత్తల యెంకటాపురం అటుకేసి తంగుడుబిల్లి ఈ ముక్క కలుపుకొని యిదంతా వూరైపోతే యెంతో అంత వుంటాదావూరు. తమ వూరికి పదిమైళ్ళ దూరంలో వున్న పెద్ద బస్తీ. ఆ పట్నంలో వో పేటంత వుండదు దానికి మూడు దిక్కుల కొండలూ వో పక్క సముద్రం.

పైడయ్య పట్నం గురించి చెపుతుంటే, చుట్టూ జనం నిచ్చరబోయి వింటు న్నారు. ఒక పిల్ల మాత్రం....

"అవున్ట. ఆ వూరు సూడాలంటే రాత్తిరేలే సూడాలంట. ఆకాశంలో యెన్ని సుక్కలుంటాయో అన్నీ దీపాలయిపోయి, అయన్నీ సీకటితోపాటు వో లోయలోకి దిగినట్టుంటాదిట. అక్కడ – దీపాలకే అవుతాదిట కోట్రూపాయలు! మా మాఁవ సెప్పినాడు గదా!" అంది – పైడయ్యనుకూడా పదిమందితో కలిపి చూస్తూ.

ఆ పిల్లకు పాతికేళ్ళుండొచ్చు అనుకున్నాడు పైడయ్య. పరాగ్గా చూస్తే సన్నికి అప్పలా వుంటుంది. ఎదురుగా తాటినిట్టను వాటేసుకు నిలబడింది. ఆమెకేసే చూస్తూంటే.

"మా బారికి రాఁవయ్య కోడలు" అంది పెద్దమ్మ.

అట్టే చూస్తే బాగోదని తలతిప్పుకున్నాడు పైడయ్య.

"అవున్రయ్య! అక్కడ నీ కేటి పని!"

"కలాసీ"

"అంటే?"

"పైడయ్య చెప్పేడు.

ఆ వూళ్ళో పెద్ద మార్కెట్టని ఓ పెద్ద మార్కెట్ వుంది. అక్కడ లక్షలూ, కోట్లూ మీద వ్యాపారం సాగుతుంది. ఓల్ సేల్ డీలర్లుంటారు. బట్టలూ, పంచదార, పప్పులూ, చింతపండూ, చిల్లర సరుకులూ ఒహటా అన్నిట్లోను వుంటారు ఓల్ సేల్ డీలర్లు. వాళ్ళ యజమాని.... కూరలు వుల్లిపాయల్లో ఓల్ సేల్ డీలరు. కలాసీ.... అంటే, ఆళ్ళకొట్టుల్లో బస్తాలు మోస్తారు. అందులో కొందరు బస్తాల దిగుమతీ లెక్కలూ, సిల్లర కొట్లుకి సరుకు సపిలీల్లాటి తేలికపన్లు సూస్తుంటారు.

పైడయ్యకి లెక్కా డొక్కా తెలీడం వల్లా, నమ్మకంగా పన్చెయ్యడం బట్టీ, అతడికి తేలిక పన్లే చెపుతారు. ఎప్పుడేనా మనుషులు తక్కువై, పనెక్కువైతే తను కూడా బస్తాలు మోస్తాడు.

"నెలకెంత కిడుద్ది?"

"అనేక కారణాలవల్ల సూటిగా జవాబివ్వలేదు పైదయ్య.

"సీజన్ను బట్టీ, మన అదురుష్టాన్ని బట్టీ వుంటాది ఆ కిట్టడం. లారీలు రాకపోకలు సజావుగుండి, సరుకు సప్లీ బాగావుంటే ఒక్కోనాడు పది రూపాయలు కిట్టొచ్చు. లేకపోతే రెండూ మూడు కిడతాది. ఒక్కోనాడు అదీ వుండదు" అన్నాడు.

వాళ్ళు వదల్లేదు.

"నెలకో డెబ్బయి ఎనభై కిడతాదా?"

"సీజన్లో కిడతాది"

"ఉట్టప్పుడో"

"అలాగిలాగ యాభైకి తగ్గదు" అన్నాడు.

మరింకేం? అన్నట్టు తలలూపుతూ, మొహాల్చూసుకున్నారు. చూసీ చూడ నట్టు రామయ్య కోడలివంక చూసిన పైదయ్యకు – ఆ పిల్ల కళ్ళన్నీ తన మీదే వుండడం కనిపించింది.

"అన్నట్టు నీ తిండెలాగరాయ్యా?" అంది పెద్దమ్మ.

"వాళ్ళెనమండుగురు మొక్కిలీసుగాళ్ళు ఒకేచోట పన్చేస్తున్నారు. వాళ్ళ కులందే ఆడమనిషుంది. రోజూ వుదయాన్నే రెండ్రూపాయలిస్తే ఉదయం సల్లందిపోసి రెండు పూటలా మామ్మూలుగా భోజనం పెడుతుంది."

"అప్పటి మడిసేనా?" అంది రామయ్య కోడలు.

ఎప్పటి మనిషో పైదయ్యకు బోధపడలేదు. తన దృష్టి తిప్పుకోడానికే ఆ పిల్ల అలా మాటాడుతోందనుకున్నాడు. తక్కినవాళ్లకది వింతనిపించడం లేదు.

"నువ్వెరుగుదు వేటే?" అంది పెద్దమ్మ.

"ఇదిగాదా! కొత్తూరు బారికప్పయ్య పెల్లంవామనిసి. ఆ మనిసి పావులాడితోనో, గొడారాడితోనో నేసిపోతే ఇప్పుడున్న దాన్ని పెల్లాడినాడు" అంది బారికి రాంవయ్య కోడలు.

నిన్న మొన్నటి పిల్ల, ముదిసాన్లా మాటాడుతుంటే, పెద్దమ్మక్కోపం వచ్చింది.

"యెప్పటి ముచ్చటే?" అంటూ నిలేసింది.

"ఎప్పటిదేంవీ – పదేళ్ళో, పదేనేళ్ళో అవుదిట్ట. ఆ మద్దె మా మాంవ మీయక్కడికి రానేదా?.... అప్పుడు పలకరిస్తే, యెరగనట్టు తల తిప్పేసింది" అంటూ సూటిగా పైదయ్యతోనే మాటాడింది.

ఆమేం మాటాడుతొందో బోధపడనట్టు ఆ పిల్లకేసి కళ్ళప్పగించి వుండి పోయేడు పైదయ్య. బొద్దుగా.... ఆ వయసొచ్చేసరికి వొళ్ళొస్తే, సన్ని యీమెలాగే వుండొచ్చు.

"అయితే అదెవరో! మీ మాంవకబుర్ల కేటి, యింతుంటే అంతంటాడు. యియ్యాల్సూసిన మనిసిని రేప్పొల్చనేడు గాని, యెప్పుడో పదేనేళ్ళముందు సూసిన మనిసిని యిప్పుడు పోల్తట్టినాడు!" అంది పెద్దమ్మ.

పైదయ్యకింకా బోధపడలేదు. చిక్కు విప్పుతున్నట్టు విడమరిచి చెప్పింది. అతడి పెద్దమ్మ.

"కిందటి వోనలికి పట్టంలో నిన్నెతుక్కుంటూ రానేదా, బారికి రాంవయ్యని నల్లగా పొడుగ్గా సెవిటోడు? వొచ్చినాక, వోపూటో రెండుపూట్లో మీయక్కడ తిన్నానని కూడా సెప్పినాడు... యిదా రాంవయ్య కోడలు. ఇందాకణ్నించి ఇదప్పగిస్తున్నదంతా ఆడు సెప్పిన ముచ్చట్లు."

అప్పుడర్థమయింది పైదయ్యకు.

ఆవేళ పొద్దోయి, బట్వాడా అందుకొని బయటి కొస్తుంటే –

నీ కోసం సుట్టం దిగినాడ్రో అన్నాడు తోటి కలాసీ, చూస్తే, ఆ మనిషిని ఎన్నడూ కలసిన జ్ఞాపకం లేదు.

ఎవరికోసంవండీ? – అన్నాడు పైదయ్య.

ఆ మనిషి, తనెవరో చెప్పకుండా, పైదయ్య ఫలానా అని తేల్చి తను పెద్దమ్మ చుట్టాన్నన్నాడు. ఆ వూరికిపైనా, యింకేదో వూరెల్తి తిరిగొస్తున్నాట్ట పెద్దమ్మ చూసి రమ్మంటే, ఆ వూళ్ళో తన కోసం దిగేనన్నాడు.

పెద్దమ్మను బట్టి అతడికి చేయగలిగిన మర్యాదలన్నీ చేసేడు. హోటల్లో భోజనం పెట్టించి, మర్యాదకి తనూ తిని, రెండో ఆట సినీమాకి తీసికెళ్లేడు.

గడకర్రలా చెయ్యెత్తు మనిషి. ఏళ్ళు పైబడి ఒంగిపోతున్నాడు. నల్లగా, సన్నగా, తెల్లని పాతకమీజు తొడిగి, ఓ పంచె తలపాగా చుట్టేడు. కింద అల వాటుగా గోచీయే పెట్టేడు. తలయారి కాబట్టి, చేతికర్ర లేందే కదలడు. అతడి పక్కన నడుస్తుంటే తనో మరుగుజ్జులా కనబడాలి.

సినీమా పొద్దయినా హాలు కొత్తది. కళ్ళు చెదిరిన రామయ్య అది తట్టుకోడానికి కొంతసేపు పట్టింది. ఆ తరవాత పైదయ్య పడ్డబాధ యింతా అంతాకాదు.

ముసిలాడికి ఆ కథ బోధ పడదు. ఏవేవో అడుగుతాడు. మెల్లిగా చెవితే వినిపించదు – గట్టిగా చెప్పటానికి చుట్టూ జనం.

ఇంటర్వెల్ తరవాత అతడికి నిద్రపట్టేయడంతో బతికేననుకున్నాడు – పైదయ్య. కాని సినీమా వదలగానే మళ్ళా ఆరంభం.

ఆ హాలేటి అంత డాబుగుందీ! సవగ్గా నేలమీద కూకునే సినిమాలు ఈ వూళ్లోలేవా! నువ్వు టూరింగు సినిమాల్నెరుగుదువా – ఎరుగవు... ఇలా నడిచింది కొంతసేపు. ఇంకొంతసేపు –

వూళ్ళోకి వూళ్ళోకే, ఒహసోట్నుండి యింకో సోటికింత

దూరంవేటీ? నువ్వీ వూళ్ళోకి సంసారంవేలతేవు! సంసారాలు లేని మనుషులు తిన్న గుంటారా – ? ఇలా సాగింది.

తోవలో కనపడ్డ ఆడా మగా, అర్ధరాత్రి దాటినా యింకా ముయ్యని కొట్లూ తిరిగే బస్సులూ రిక్షాలూ – అన్నిటి గురించీ తెంపులేకుండా ఒకటే ప్రశ్నలు.

పైడయ్యకు గదిలేదు. కూరల మార్కెట్‌లోనే, ఓ అరుగు మీద పడు కుంటాడు. కొన్ని కారణాల చేత అక్కడ దీపాలు మన్నవు.

గేటుదాటి మార్కెట్‌లోకి అడుగు పెడుతుండగా, ఓ పందికొక్కు కాళ్ళలో పడ్డది. అక్కణ్ణుండి, ఏ పాడువంకాయ కాలుకింద పడ్డా, యే కుళ్ళు దోసకాయ మీద కాలు పడ్డా రాంవయ్య గాభరా పడిపోయేవాడు.

చూరునున్న గోనె గుడ్డలూ, చాప ముక్కలూ పీకి, వాటినోసారి గట్టిగా దులిపి పక్కలు పరిచేడు పైడయ్య.

అయితే, ముసలాడు నిద్రపోలేదు. అక్కడ పూరంతా అంత ఎలుగేటి? – యిక్కడీ సీకటేటి? – అంటాడు. ఈ అరుగులు యింత గలీజుగ వున్నాయి ఎప్పుడూ కడగరా? – అంటాడు. దోవంల్నీ, చీవంల్నీ, నల్లుల్నీ నలుపుకొంటూ యిటూ అటూ పరిగెత్తే ఎలుకలూ, పందికొక్కులూ యెక్కడ కరుస్తాయో అని భయపడుతూ, యెంతో రాత్రి దాకా నిద్రపోలేదు.

దెబ్బతో తెల్లారగానే బస్సెక్కుతాడనుకున్నాడు. యెక్కలేదు. పైగా, వూరు చూపించమన్నాడు.

తప్పేది లేక, తోటి కలాసీలతో షావుకారికి కబురంపి, తిండి పెట్టే మనిషితో యింకో మనిషికి వండమని – బయల్దేరేడు.

పట్నంలో వుండే భవనాలూ, ఆరేడంతస్తుల మేడలూ, హాస్పిటలూ, ఆఫీసులూ చూపి బజార్లన్నీ తిప్పేడు. దార్లో కనిపించిన వాటి గురించి తెలిసినంత వరకూ చెప్పేడు. ఒంటి గంటకు పేగులు నక నకలాడుతుంటే ఇంటికెల్దా మన్నాడు రాంవయ్య.

నాకిల్లు లేదు గదా? – అన్నాడు పైడయ్య.

మర్నీకు సంచో గించో, పెట్టే బేడో, ఉండదా – అదెక్కడెట్టినా? –– అన్నాడు రాంవయ్య.

కొట్లోనే ఓ మూల్నెట్టుకుంటాను – అన్నాడు పైడయ్య.

మరి తిండో?

తిండి యేర్పాటు గురించీ చెప్పేడు.

అయితే అక్కడికే తీసుకెళ్లు – అన్నాడు రాంవయ్య.

మార్కెట్‌కి నాలుగైదు వీధుల వెనకనే వుంది – ఓ చిన్న మురికివాడ. పెద్దపెద్ద పట్టణాల్లో ఉండే అన్ని వాడల్లాగే ఉంటుంది ఆ వాడ కూడా. నగరం మధ్యలో వుండడంవల్ల, ఆ వాడ చాలా చిన్నది. చిన్నదవటం వల్ల, మరీ యిరుగ్గా ఉంటాయి అందులో యిళ్ళు. ఒక పెద్ద మురుక్కాలవకి యిటూ అటూ చితచితలాడే చిత్తడి నేలపై, యిల్లు మీద యిల్లు వేసి మనిషి మీద మనిషిగా ఉంటారు జనం. ఆ వాడకు రెండు పక్కలా పెద్దపెద్ద భవనాలతో వీధులు. ఓ వైపు బ్రహ్మాండమైన సినిమాలు హాలు, దానిమీద బతికే హోటళ్లు. నాలుగో వేపు – యెడతెగని ట్రాఫిక్‌తో ఆ వూరినుంచి పోయే గ్రాండ్ ట్రంక్ రోడ్డు.

అందులో అడుగు పెడుతూనే, యిక్కడా వుంటున్నావు? – అన్నాడు రాంవయ్య.

దడిపెట్టి, మట్టిపూసిన గోడల్లో 'చుట్టు – యిలారం' గుడిసెలున్నాయి. పల్లెటూరి పింపిరినాటిన యినప రేకులూ, తలుపులుగా అడ్డం పెట్టుకుంటారు. తాటాకులూ, యీతరేకుల చాపలూ, పై కప్పులు, గడ్డీకమ్మా, గోనెపట్టాలూ, ఇనపరేకులూ, యే చెత్తపడితే ఆ చెత్తతో మూసి, అవే యిళ్ళంటారు అక్కడి జనం!

మంచానికి సరిపోయే ఓ గది పట్టుకి అద్దె – పది రూపాయలని వినగానే, రాంవయ్య మరి మాట్లాడలేదు. కన్నం లాంటి ద్వారంలోకి దూరలేక, వాకిట్లోనే కూచుని తనకు పోసిన గంజి మెతుకులు కతికేసేడు. రోడ్డు మీద కొచ్చి కొళాయి దగ్గర పాదాలు రాసి రాసి కడుగుతూ అన్నాడు –

నన్నడిగితే, తిండినేక యే గడ్డో కరిసి సావడం మెరుగు; పేనాలు ఒక్కపాలి పోతాయి.

అతడొచ్చి చెప్పిందాకా, తను యెలాంటి చోట ఉన్నాడో పైడయ్య గమనించ లేదు. ఆ వాడలోనూ, అలాంటి వాడల్లోనే, ఆ పూరి జనంలో ఐదోవంతు బతుకుతున్నారు. పదిరాళ్ళు జేబులో ఉన్నప్పుడల్లా ఫరవాలేదనిపించినా, డబ్బులు తక్కువైనప్పుడల్లా ఆ మాటలు గుర్తొచ్చేవి.

"నా నందుకన్లే దప్పా: ఇప్పుడు కులాలెవరు సూస్తన్నారు – నాకూ కులాల కన్లేదు. అప్పటి మడిసేనా? మడిసి మారిందా? అన్నాను."

– ఆ పిల్ల పెద్దమ్మతో అంటోంది.

"ఏంవో, ఎందుకన్నావో? – యెందుకన్నా – మీ మాంవ అదెట్టిన కూడు వో పూట తిన్నాడు. ఆడి కులం పోతే నా కొడుకు కులంవూ పోతాది. ఆడిది పోప్పోతే యీడిదీ పోదు."

విన్నవాళ్ళు నవ్వేరు. కొంతసేపు ఎవరూ మాటాడలేదు.

పైడయ్యా వొదినల్లో ఒకామె ఉండుండి అరిచింది –

"నన్నడుగుతావేంవే? నానేం యెల్లినానా, సూసినానా! మీ సినబాబు నడుగే!"

పొదికట్టున కూర్చున్న పదిహేనేళ్ళ పిల్లవంక తిరిగి

అంటోంది. రహస్యం బయట పెట్టిందన్న ఉక్రోషంతో ఆ పిల్ల ముఖం ముడుచుకొని ఆమె వీపు మీద చెయ్యి పెట్టి తోసేస్తోంది.

చినబాబు వరసను బట్టి ఆ పిల్ల కన్నయ్య పెళ్ళామని గ్రహించేడు పైడయ్య. ఏఁవిటేఁవిటంటే ఆ పెద్దామె చెప్పింది.

చెప్పడమే తరువాయి పెద్దమ్మ అందుకుంది –

'అవున్రయ్యా! సెప్పురా, ఈ పిల్ల కొహతికి మా ఉబలాటం గుంది. ఆ మద్దినల్లా దీని మొగుడు గెంతినాడు. ఆడట – ఇందంబడి కంబారరికాలు సెయ్యనేట్ట. నీకాడకొచ్చి పని సూసుకుంటానన్నాడు. ఆ మద్దె రాఁవయ్యొచ్చి పట్టం కబుర్లు సెప్పినాక కొంత తగ్గినాడు. ఇప్పుడు దీని బులపాటం మొదలయ్యింది. యెప్పుడో బయలెల్లి పట్టం వొస్తాది కావాల. సెప్పు" అంది పెద్దమ్మ.

"కేవు – అడిగినంత మాత్రాన యెలిపోద్దా. నీ మాటగాని" అంది పిల్ల పిన్నమ్మ.

"నీ మనవణ్ణొగ్గేసి అదొక్కతే యెలిపోద్దా!" అన్నాదో వరసైన అమ్మమ్మ.

"ఏఁవో వొగ్గేసెల్లినా యెల్తారీకాలం పిల్లలు! ఈ లంతా వో జట్టున్నారు. పట్టం ఆలకి సొరగంగుంది. ఆలకో గురువు – వుందికదా!" అంది రాఁవయ్య కోడలు మీద విసురుగా. ఈసారి రాఁవయ్య కోడలు వూరుకోలేదు.

"ఏం! యెల్తె తప్పేటి?" అంది బయటపడుతూ.

పెద్దమ్మ జవాబివ్వక పోయేసరికి యింకా గట్టిగా అంది.

"ఇక్కడిలాగ పల్లిగరగరుసూక్కూకునే కన్న, యెల్తె వొచ్చిన నష్టఁవేటి?"

ఈ ప్రశ్న తక్కిన వాళ్ళవంక తిరిగి వేసింది. వాళ్ళెవరూ మాటాడలేదు. పెద్దమ్మే అంది –

"నష్టమని యెవురన్నారే. యెల్తే యెల్లండే! ఆ వుచ్చుల్లో, రొచ్చుల్లో, ఆ ఈగల్లో, దోవల్లో, ఆ పందుల గుడిసెల్లో పడి దొర్లండే? యెవరొద్దన్నారు?" అంది పెద్దమ్మ.

"అవును. ఇక్కడున్న – మేడలూ, మిద్దెలూ, పట్టి మంచప్పరుపు లొగ్గేసి, అక్కడందబడ యిందబడ దొర్లడం తప్పే!" అందాపిల్ల.

"ఇక్కడా నేదు; అక్కడా నేదు. ఆ కాడికి అక్కడికెల్లి సావడం దేనికి? ఇక్కడే సస్తే కాదా?" అంది పెద్దమ్మకి సాయంగా యింకో పెద్దమ్మ.

"అక్కడ ముద్దయినా ముక్కలొద్దికదా యిక్కడేటుంది?" అందో పడుచుపిల్ల.

దానిమీద ఆడవాళ్ళు నలుగురూ నాలుగు మాటలుగా మొగుసుకు పోయేరు. వాళ్ళ ధోరణి నుండి పైడయ్యకు అర్థమయ్యిందేమంటే, యీ తర్కా లకి మూలం యిప్పటి సంగతి కాదు – వెనకట్నుంచి వున్న రగడ మళ్లా బయట పడ్డం.

"ఆఁ! – ఇక్కడ తినడం మానీసినారు!" అంటూ సాగదీసింది పెద్దమ్మ.

"తింటున్నాం, కనపడ్డం నేదా? మళ్ల సెవతన్నావు! నీ కొడుకే వున్నాడు. యెనిమిదేళ్ళయి యెంకన్రాయుడు కాడ కంబారిగున్నాడు. మొదటి నాలుగేళ్ళు ఏం తిన్న గిచ్చినారో జీతాలిచ్చినారు. మరసటేడాది యిదిగో రేపు, అదిగో మాపు, ఆఁవా సొస్తంది, పున్న వెల్లనీ అని అప్పుడో యిద్దుం, అప్పుడో ముత్తుం సొప్పున ఆర్నెల్లు జీతం కొలిసేతలికి గగనఁవై పోనాది.

ఉన్న జీతం వచ్చీ పంటలకన్నారు.

ఆ యేడు పంటలు పోనాయన్నారు. పంటలూ పోనేదు. ఆల బతుకులూ పోనేదు – మాడిపోతన్నాఁవని కాల్లా యేల్లా పడితే, మూణ్నెల్ల జీతం కొలిసి ఇప్పటికింతే అన్నారు. ఇప్పుడీ రెండేళ్ళయీ పంటలు పోతన్నాయి. అసలొక్క గింజ కొలిస్తే వొట్టు. గట్టిగా అడిగితే, తంతారని బయ్యం.

అరువుకి పాటుపడ్డం ఎందుకు? మానీ రాదా! అంటే – 'మానీస్తే, మొదటికి మోసం కాదా! – ఎప్పుడో పండితే, బాకీ జీతాలు కొలుస్తారేఁవో" అంటాడు నీ కొడుకు. అంతేగాని, రోజు కూలికి పోయినా, దొరికిన్నాడో రూపాయి దొరుకుద్ది అనుకోడు" – అంది రాఁవయ్య కోడలు.

"అయి మాత్రం తేరగున్నాయేటే?" అంది పెద్దమ్మ.

"– అయీ తేరగనేవు, యియీ తేరగనేవు. నాననీదీ అదే. అందుకే పట్నం పోతే కాదా? అంటాను. ఈ జీతనాతాలు లేని కొలువులు కొలసి యిగిరి సావడం కన్న పందల దొడ్లల్లోనో, పాయికానాల్లోనో యెక్కడో వొక్కాడ తల్దాసుకుంటే, కడుపునిండా గంజైనా తాగొచ్చు. ఇక్కడా గంజికీనేక, తోట లంబటా దొడ్లంబటా తిరగనేల? తన్నులూ తాపులూ తినీ, మాల ముండజాతి దొంగ జాతని అడ్డఁవైన అదవా జాతుల్చేతా మాటపడ్డఁవేల?"

– రావయ్య కోడలు ఆగిపోయింది.

"అయితే నీ వొక్క పొట్టనిండితే సాలా?" అంది పెద్దమ్మ.

"ఏం, నిన్ను రావొదన్నానేటి?" ఎదురు ప్రశ్న వేసింది కోడలు.

"ఊరు వూరల్ల యెల్లి పట్నం మీద పడితే అక్కడ మాత్రం కూల్లు గూకున్నా యేటే. నీలాగ, యెన్నాళ్ళ నుండి, యెంత మందెన్ని జాతులోళ్ళు ఆ పట్నాల మీద పడాల! వొచ్చినోళ్లందర కక్కడ కూల్లు పుడతాయా? ఆ మద్దె కప్పరాం

పోతయ్యా తమ్ములూ వున్న యిల్లూ వాకిలీ అమ్మేసి, పట్నం పరిగెత్తినారు. ఆర్నెల్లు తిరక్కుండా పారొచ్చినారు. అక్కడ మరదల్నెవలకో అప్పగించి మరీ పారొచ్చినారు." అంది పెద్దమ్మ వెటకారంగా.

"యెవడో పారొచ్చినోళ్ళ సంగతి సెప్పడవఁవేల? అక్కడున్నోళ్ళ సంగతి సెప్పరాదా?"

"ఆళ్ళూ పారొస్తారు; యియ్యాలకాప్పోతే రేపు!"

"సరె, మాఁవూ అప్పుడే వస్తాం. అందాకా బతకనీ?"

"అంతేగాని జనవందరి బతుకేటని ఆలోసించవు?"

"రాఁవయ్య కోడలికి వెంటనే జవాబు దొరకలేదు. కొంచెంసేపాగి – "నరే – నా నాలోసించను. ఆలోసించిందానివి నువ్వు సెప్పు" అంది తిప్పి కొడుతూ.

యేం చెపుతుంది పెద్దమ్మ! పరమాత్ముణ్ణి సాయం తెచ్చుకోబోతే, భగవంతు డిలా దిగేడు కన్నయ్య.

అతడు మాటా మంతీ లేకుండా వచ్చి, తువ్వాలు దడదడ తలకు చుట్టు కున్నాడు. చుట్టుకొని

"లెగెహ్ తొత్తుకొడకా! లెగు లెగురా.... లెగు!" అంటూ పైడయ్య గుండెలు మీదా; నుదురు మీదా నాలుగైదు చరుపులు చరిచేడు. వాటికి తట్టుకోలేక పైడయ్య లేచిపోతే ఆ యెత్తు పీటమీద కూర్చున్నాడు.

"తొత్తుకొడగా? నానెక్కడుంటే అక్కడికి రావాలని తెల్దా? నాన్నీ కాళ్ళకాడికి రావాల్రా? --- రా! కూకో, నా కాళ్ళ కాడ!...." అంటూ అతడు కూర్చోక పోగా అతడిమీద కలియబడ్డాడు. కోడెదూడల్లా కుమ్ములాడుకుంటున్న ఆ నేస్తుల పట్లు చూస్తూ – గోల గోల చేసేరు ఆడవాళ్ళంతా. పెద్దమ్మ ఓ కర్ర పట్టుకొచ్చి కొడుతూ వాళ్ళను విడిపించబోయింది.

★ ★ ★

అన్నాడు గాని పైడయ్య మాట నిలబెట్టుకోలేదు. తింటే గాని గుమ్మం దిగనివ్వలేదు పెద్దమ్మ. ఇంటికెళ్ళకుండా తిన్నగా చెరువు గట్టు కొచ్చి కూర్చున్నాడు పైడయ్య.

ముది యెండ నీరెండగా మారుతోంది. సన్నగా ఆరంభమైన చలి; సన సన్నగా పెరుగుతోంది. ఎంతకూ సన్ని వచ్చే జాడ కనిపించలేదు.

పూరవతల కనపడ్డ మనిషి తాటిపెండెలు దాటేవరకూ చూస్తాను. అప్పటికీ జాడ కనిపించకపోతే, లేచిపోతాను – అనుకున్నాడు పైడయ్య.

పైడయ్య, సన్నికోసం చూస్తున్నాడేగాని – అతని మనసులో సన్ని కదలడం లేదు. రాఁవయ్య కోడలే అతని మనసల్లా అల్లుకుంటోంది.

రాఁవయ్య కోడలు.... యేపుగా కాసిన కాయలా, నిండావిడ్డ పువ్వులా వుంది. ఆమెను చూస్తే అతడికి ఆశగా వుంది. ఆ వెనుకనే బెదురు కూడా వుంది.

అక్కడ మాటాడుతున్నంతసేపూ, ఆమె కళ్ళు తన మీదే వున్నాయ్. పెద్దమ్మతో వాదిస్తున్నప్పుడు కూడా తననే పెద్దనుచేసి వాదించింది. ఆమె కళ్ళల్లో తడి, ఆ తడిలో వెలుగు, ఆ వెలుగు నిండిన ముఖం, ఆ గొంతులో మాలిమి, అందులో రోషం అతణ్ణి విడవకుండా వెంటాడుతున్నాయి.

కల్లాకపటం లేని మనిషి. అంచేత అలా కనిపిస్తది. నా నెరిగిన కాడికి దాని కలాంటి బుద్ధులు లేవు – అన్నాడు కన్నయ్య. పైడయ్యక్కూడా అలానే అనిపిస్తోంది. అయితే నమ్మబుద్ధి కావడం లేదు.

అప్పిడే పయానవా? – అంది వచ్చేస్తుంటే.

మరేటి? వుంటే – రాత్రికి కూడేనా యెడతావా – యేవన్నానా? – అన్నాడు కన్నయ్య.

నా నెట్టడఁవేల? నీ యింట ఆడోళ్ళునేరా.... అల కొండెట్టడం రాదా – అంది రామయ్య కోడలు.

పూరవతల కొచ్చాక, ఆ మనిషి గురించి అడిగేడు పైడయ్య.

కన్నయ్య చెప్పుకొచ్చాడు –

రాఁవయ్యి కోడలికి, పట్టంలో కాపరఁవెట్టాలని ఎంత కాలం నుండో మనుసు దాని మొగుడికి వొల్లుందిగాని కాసింత మెతక....

అందుకని, ఆమె కన్నయ్యని పూటు చెయ్యడం మొదలెట్టింది. కన్నయ్య అలా గలాగే – అంటూ నెట్టుకొచ్చిన కొద్దీ, ఎక్కడ దొరికితక్కడ అదే పూసు. రోజు రోజుకు బలవంతం పెరిగిపోతోంది.

చివరికి యేటిగదా దీనుద్దేశం అనిపించింది.

ఒకటి రెండుసార్లు చెయ్యి చేసుకోబోతే సులువెరిగి తప్పించుకుంది. ఒకనాడు మాత్రం ఒంటిగా దొరికిపోయింది.

ఇప్పుడెటెల్తా? – అన్నాడు కన్నయ్య.

ఎటూ యెల్లను. కాని, నీ కొక్కమాట సెపతాను. కడుపుకుండి, మనిషి దొంతగనం సెయ్యరాదు. కట్టుకున్న పెనిఁవిటో, పెల్లఁవో వుండి కానిపని సెయ్యడం తప్పు. నీ కింటికాడ పెల్లం నేకపోతే సెప్పు. దాని కొంట్లో సుకం నేదన్నా నా నొప్పుకుంటాను. కాని తీరి కూకోని కాపరాలు సెడగొట్టకు. అందరు మొగోళ్ళూ ఒకటైనట్టే అందరాడోళ్ళం ఒకటే – అందా పిల్ల.

కన్నయ్య తల వంచేసుకుని వచ్చేశానన్నాడు.

ఈ లెక్కని చూస్తే, ఆ మనిషి పక్కని యేవారనీ నిలపడలేదు సన్నెమ్మ. ఆ లెక్కని తను కూడా కన్నయ్య పక్క

నిలబడలేడనే అనాలి –

గట్టెక్కుతూ బుట్టతో ఆడమనిషి కనిపిస్తే, పరకాయించి చూసేడు పైడయ్య. అదెవరో యేభయ్యేళ్ళు పైబడ్డ మనిషి, ఇంక రాదిది అనుకుంటూ, పొద్దుకేసి చూసి లేద్దామనుకోగా, ఇంకొక్క సిటం అని గడ్డం పట్టుకుంది మనస్సు.

– అయితే అప్పటికి సన్నెమ్మ కాపరానికి రాలేదు. యెండ వేళప్పుడు పోతయ్యగారి పెండిని తాటికాయల కోసం తిరుగుతున్నాడు. కిందా మీదా యెండ మాడ్చేస్తుంది. పెండవతల దొంతర గెడ్డల్లో ఆడపిల్ల ఒంటిగా వొండలోకి పోతోంది.

ధగ ధగ ధగ ధగ వెలిగిపోతున్న ఆ బయల్లో, కనుచూపు మేర మనిషిపొడ కనిపించడం లేదు. గాలీ; గాలి చెట్లను దూసుకుపోయే చప్పుడూ, తప్పితే పిట్టయినా కీచుమన్నట్టు లేదు.

సముద్రపు గాలి చల్లగా తగిలినా ఒళ్లు మండిపోతోంది. ఉండుండి విసిరే పొడిగాలుల వరసలో వూపిరాడ్డం లేదు. దడదడలాడే గుండెల్తో జవ జవలాడే కళ్ళతో దొంగలా నాలుగు ప్రక్కలా చూసేడు. తెగించిపోతే దొంతరగెడ్డ వొడల్లో, మాదిగప్పయ్య కూతురు ఒంటిగా కూర్చుంది. పొరుగు తోటలో తెంచుకొచ్చిన మామిడికాయలు దొంగతనంగా తింటోంది. కొరికిన కాయ పట్టినచేత పైట తొలగిస్తూ రెండో చేత్తో ఒడిలో కాయలు బొద్దుకొంగున దోపుతోంది. తనను చూసి – గతుక్కున చిరుగుల పైటతో కాయలు కప్పేసుకోబోయింది.

ఆనాడు తను చేసిన పనికి యెన్నాళ్లో ఆమె ముందు తలెత్తలేక పోయేడు. ఇప్పుడాలోచిస్తే – అందులో తన తప్పులేదు. ఆకలే అన్ని పాపాలకీ తల్లి.

ఆ రోజు ఏ పరిస్థితిలో వున్నాడో, ఈ రోజూ అదే స్థితిలో వున్నాడు పైడయ్య. అతడి బుద్ధి పరిపరివిధాల పోతోంది. ఏం చెయ్యడానికీ తెగువ చాలడం లేదు.

ఈ మనిషి వచ్చింది కాదుగదా అనుకుంటూ, లేచిపోయేడు పైడయ్య. లేచేసరికి పట్టరాని కోపం వచ్చింది. అది దుఃఖమో, కోపమో తెలియడం లేదు. ఏదైనా తీర్చుకునే వుపాయం లేదు.

బట్టలు దులుపుకుని గట్టున నడిచే పైడయ్య పడమట బారెడు పొద్దుండ డం చూసేడు. గట్టు మధ్య పేరంటాల గుడికొచ్చేసరికి, గంగమ్మ జ్ఞాపకాని కొచ్చింది. చెప్పలేని విధంగా గుండె తేలికై చెరువుకడ్డం పడ్డాడు.

చెరువు గర్భం గడిచి పదడుగులేస్తే చెన్నంగి కొబ్బరితోట. దాని మొదట్లోనే ఉంటాది దెయ్యేల గంగమ్మ పాక.

“ఏంరోరయ్య ఇలా దారితప్పినా!” అంటూ పలకరించింది గంగమ్మ. అక్కడికి వూరు మైలు దూరంలో కనపడుతుంటుంది.

“తప్పినా పొద్దారే కదా?” అంటూ సమాధానం ఇచ్చేడు పైడయ్య.

శుభ్రంగా తుడిచిన దాగరంత వాకిట్లో – మూడు రాళ్ళు పెట్టి గంజి కాస్తోంది గంగమ్మ. ఆమె కెదురుగా – ఒక రాయిమీద కూర్చున్నాడు పైడయ్య. అతడి మొహం మీద సాయంకాలపు ఎండ పడుతోంది. ఎర్రని ఎండలో నల్లని మొహం – నిండా రగులుకోని నిప్పు కణికలా వుంది.

“మొకవేట లాగుంది?” అంది గంగమ్మ, పొయ్యిలో మంటకేసి చూస్తూ.

“పొద్దుటనగ బయలెల్లిన మనిసిని, ఇప్పటిదాక తిరిగి తిరిగి యీ వలట్టి పోనాను. దాహానికి సల్లనీల్లిస్తావని నీకాడ కొచ్చేను” అన్నాడు పైడయ్య. వైద్యుడు రోగాన్ని చదివేటంత తేలిగ్గా, అతడి మొహంలో ఆకలి చదివింది గంగమ్మ, అంచేత శీతాకాలం అంటూనోటిదాకా వచ్చిన మాట ఆపి –

“ఎక్కడి కెల్లినా?” అంటూ, పక్కనున్న కంపల ముట్టి దగ్గిరి కెళ్ళింది గంగమ్మ.

పైడయ్య, ఎక్కడెక్కడి కెళ్ళేడు చెప్తున్నాడు. కొంత సేపామాటలు విని –

“ఎవరది నారాయుడూ!” అన్నాడు లోపల్నుండి ముసలాడు.

గంగమ్మ మొదట కట్టుకున్న మొగుడు ఐదారేళ్ళు కాపురం చేసేక, ఇంకొకతెను లేవదీసుకుపోయేడు. పదేళ్ళు మగతోడు లేకుండా బతికింది గంగమ్మ. ఇప్పుడున్న మొగుడు, రెండో పెళ్ళం పోయేక యీమెను చేరదీసేడు. చేరదీసిన కొద్ది కాలానికే అతడికి వొళ్లమాలిన జబ్బుచేసి రెండూ కాళ్ళూ పడిపోయేయి. అయినా, అతడి ప్రాణాలకన్నా విశ్వాసంగా ఆ బొందిని పట్టుకు వేలాడుతోంది గంగమ్మ.

“నారాయుడు కాదు ఆళ్ళ తమ్ముడు పైడియ్య” అంది లోపలికి వినిపించే టట్టు.

“నా కాడ సుట్టముక్క ఉండదుర పెద్దోడా! బీడీ ఇద్దునా!” అంటూ పైడయ్య లేచి లోపలికెళ్ళేడు.

ఆ పాకలో – ఓ మంచం, నీళ్ళకడవా తప్ప యింకేమీ లేవు. అంతకన్నా ఎక్కువ సామాను అది పట్టదు కూడా అనుకున్నాడు. ఉట్టిమీదున్న రెండు చట్టెల్నీ, మంచం కిందున్న యిసకచేటనీ అతడు గమనించలేదు.

“నీ దయ యేఁవిచ్చినా పుచ్చుకుంటాను” అన్నాడు వెలుగు రాసిన గొం తుతో. పాలిపోయి గుంటలుపడ్డ ముఖంలో

పత్తికాయల్లా తేలిన కళ్ళల్లోకి చూడలేక, పైడయ్య చూపులు తప్పించేడు. ఒక బీడీ అంటించి యిచ్చి, ఇంకో బీడీ తీసి పక్కను పెట్టి, ఇవతల కొచ్చేసేడు. గంగమ్మ గంజి కలియబెట్టి, తెడ్డుపక్కన పెడుతోంది.

ఎదురుగా కూర్చున్న పైడయ్య యెంతకీ మాటాడకపోతే, పట్నంలో అతని మంచి చెడ్డల గురించి భోగట్టాలడిగింది. వీవరాళ్ళ తగువు గురించి కదిపి విన్న దాంట్లో నిజానిజాలడిగింది. పైడయ్య ముక్తసరిగా జవాబు లిస్తున్నాడే తప్ప మాటల్లోకి దిగడం లేదు.

కొంతసేపు పోయేక –

"ఏఁవొచ్చినా?" అంది గంగమ్మ.

"సెప్పనేదా? దప్పిగ్గుంది" అన్నాడు పైడయ్య మోర పైకెత్తి.

"దప్పిగ్గుంటే, సెగిడి సన్నాసయ్య పాక్కెళ్ళాల. నాకాడకొస్తే నానేటిస్తాను?" అంది తొణక్కుండా.

"నీకాడ యేదుంటే అదే" అన్నాడు పైడయ్య.

"నాకాడ ఈ గంజొక్కటే ఉన్నాది. ముసిలోణ్ణి యిగిర్చి పొయ్యమంటే నీకే పోస్తాను" అంది నవ్వుతాల్లాడ.

గంజిలో మెతుకులు పలుకువిడ్డం చూసి, దాకను పాకలోకి తీసుకు పోయింది. తిరిగొచ్చి కుట్టుతీసేసి నిప్పార్పుతుంటే, పైడయ్య వణికే గొంతుతో ఆరంభించేడు –

"నానార్నెల్లయి, ఆడమనిషి కోసం ఉపాసఁవున్నాను. ఇయ్యాల ఇంటికొస్తే మా యమ్మా అత్తా కుమ్ములాడుకుని మమ్మల్నిడదీసినారు. నిన్న రాత్తిరి దాన్ని తవిటప్ప ఇంటికి రమ్మన్నాను. దానికీ నా బాధ అర్ధఁవైనట్టు నేదు. సెప్పకేం – కత్తెట్టి ఒక్కొక్కల్నీ పోటు పొడిచేసి, ఆ యెంట నానూ సత్తునా అనుకున్నాను కాని నా కాపాటి తెగువ నేదు – అంత తెగువే వుంటే నా బతుకిలాగుండ దనుకున్నాను.

ఇల్లు గడవడం కష్టంగున్న రోజుల్లో మా సిన్నన్నని పట్నం రమ్మన్నాడు – ఆల్ల అత్తోరి తరపు మనిసొకడు. మా సిన్నాదిన యెంత బతిమాలాలో అంతా బతిమాలింది. మాయన్న కదల్నేదు, అప్పుడు నాను బయల్దేరినాను. ఎల్లినందుకు ఎన్నిపాట్లు పడ్డానో, ఇప్పటికీ యెంత పడతన్నానో ఆ భగమంతుడికే తెలి యాల; నాకు పెల్లాన్నొగ్గుకొని అడివినాటి పట్నంలో వొల్లిరుసుకుంటున్నాను. అయినకాడికి అయిదో పదో నెలనెలా మిగలేసి పంపుతున్నాను. అలాగవస్తలు పడుతున్నందుకు ఆర్నెల్లుకోపాలి వస్తాడన్న జాలైనా లేకపోయింది మా జనా నికి."

– అంటూ ఆగేడు పైడయ్య. ఆ ఉదయం కన్నయ్యతో చెప్పుకోబోయిన మాటలు, ఆమెతో చెప్పుకుంటున్నానా అనుకున్నాడు మనసులో.

"కావాలంటే, పట్నంలో నాయిష్టఁవొచ్చినట్టే నానుండగల్దును. నాతోటోల్లంత యెలాగ తంటాలు పడతన్నారో నాను సూస్తూనే వున్నాను. అన్నిట్లో అల్లా గుండొచ్చు గాని, ఆడ దాన్దగ్గిర అలాగుండాలంటే మనసొప్పుకోడం నేదు. ఇరుగమ్మకో పొరుగమ్మకో పాటుపడితే యిల్లిరగతి యాల; కన్నెపిల్లని సెరిపితే, కలకాలం దానుసురు తగుల్తాది. మరింక రోడ్డోరమనుసులు న్నారు – ఆల జోలికెల్తె, ఆసుపత్రికి పోవడం సరేసరి – పన్లో కెల్లకండ పదిరోజులుంటే కూల్డబ్బుల మాటేటి? అందుకే నా బాధ నాకు తెలియాల; ఆ దేవుడికి తెలి యాలన్నాను –"

పైడయ్య చెప్పడఁవాపి తలొంచుకు కూర్చున్నాడు. అప్పటికి చీకట్లు బాగా వొత్తుకుంటున్నాయి. కొంతసేపు ఓ పుల్లతో నేలమీద గీసిన చోటనే గీస్తూ కూర్చున్నాడు.

"ఇప్పుడైనా నాన్నిన్ను అడుక్కోకపోదును. రాత్తిరి నా కొచ్చిన తలపులు తలుసుకుంటే, నాకే జడుపు పుడుతోంది. ఎర్రిలో ఎప్పుడే సేసేస్తానో – అని బెంగ గుంది. ఆపైన నీదయ నా అదరుష్టం" అంటూ ఆగిపోయేడు.

గంగమ్మ కాగొంతు ఆరేళ్ళక్రితం ఎలా వినపడ్డదో, ఇప్పుడూ అలాగే వినపడింది. ఆరేడేళ్ళ క్రితం ఓ ఎండవేళ ఇలాగే వచ్చేడు పైడయ్య. అప్పటికి పెళ్ళవుతుందో, అయిందోగాని సన్ని కాపరానికి రాలేదు. ఇంకోసారి అడగ నంటే, అలాగే కానిమ్మంది గంగమ్మ. నాటికి నేడు మళ్ళీ వచ్చేడు. పైడయ్య మనిషేఁవీ పెరగలేదనుకుంది తన మనసులో.

"ఇందాక ముసిలోడి పలకరింపు ఇన్నావుగదా! నిన్ను మీ పెద్దన్నను కున్నాడు" అంది ముందస్తుగా. "నానిప్పుడు నీ కొదెన్నవుతాను. గడియకో, సిటంకో మీయన్న రావాల" అంది గంగమ్మ.

ఆ బోగట్టా విని పైడయ్య బొమ్మలా కూర్చుండిపోయేడు. అతడిమీద జాలి ఇబ్బడికాగా గంగమ్మ అడిగింది –

"నీకు నాటుసారా పడతాదా?" అంది తల్లిలా.

పైడయ్య యెప్పుడైనా తాగడం కద్దు. కాని అతడు మాటాడలేదు. గంగమ్మ గ్రహించి లోపలికెళ్ళింది. తిరిగొచ్చి వో సీసా ముందు పెడుతూ –

"ఇది మీ అన్నకైతే రెండు సుట్లుకొస్తాది. సగందాకా తాగి సగం ఒగ్గీ" అంటూ మసాలా పొట్లం పక్కన పెట్టింది.

ఆ తరవాత ముసిలాడికి గంజి పొయ్యడానికెళ్ళింది. అతడికింత పోసి, తను కొంచెం తాగి, కుండలూ మండలూ కడిగి తిరిగొచ్చేసరికి – పైడయ్య వెచ్చగా కబుర్లారంభించేడు.

ఒక అరగంట ముప్పావుగంట గడిచేసరికి – చుక్కల్లో యెగురుతున్నాడు.

సగం సీసా అయ్యేక ఆపమంది గంగమ్మ.

"వొదిన్నవుతానంటే నిన్నొగ్గేసినాను. అన్నీ నీ యిష్టవేనంటే – అలా సాగు తాదా?" అన్నాడు పైడయ్య.

ఆ మాట విన్నాక, తాగనివ్వడమే మంచిదనుకుంది గంగమ్మ. తాగేవాళ్ళ సంగతి ఆమెకు బాగా తెలుసు. అతడు మోతాదు మించినా యింకా మతి తప్పడం లేదు.

"మాయన్న అందరు పిల్లలమీద, పెళ్ళాడనంటే, మంచోడు – మంచి పనిచేసేడనుకున్నాను. అయితే ఆడు యెలాగ బరిస్తన్నాడా అని దిగులుగుండేది. ఇదిగిలాగన్నమాట.

నన్నడిగితే యిదీ మంచిపనే ననాల. అత్తలాడూ సుకపడతన్నాడు. ఇత్తల నువ్వూ సుకపడతన్నావు. మన లాటి కష్టపాటు జాతికేఁవుంది, కడుపు సుకం లేనేలేదు. ఎయ్యి జనమలెత్తినా వొస్తాదని నమ్మకఁవూ లేదు.

సుకాలన్నిట్లోకి సుకం ఆడామగా ఒక్కాడ అనుబగించిందే – సుకం! ఇప్పుడిదీ సుకఁవే. కానదీ దీనికి కరుసున్నాది. ఇదయ్యేక రేపు కొంత దండు గున్నాది. ఆ సుకానికైతె కానీ కరుసు నేదు – రేపు దండుగ నేదు. పేదోడికి బగమంతుడు మిగిలించిన సుకఁవది.అయితే, నాలాటి అదురుష్ట వంతుడు కడుపు కాసిస్తే ఆ సుకఁవూ అందడం నేదు సూడు – అదెంత పసందు గుందో...."

సుఖంలేని తన బతుకును గురించి, ఏఁవిటేఁవిటో కూస్తున్నాడు పైడయ్య. అంత మైకంలోనూ మనిషినే కాదు దేవుణ్ణి కూడా నెప పెట్టడం లేదు.

కూసికూసి, చప్పచప్పగా చల్లారిపోయేడు పైడయ్య. పాకలో ఎండుగడ్డి తెచ్చి పరిచేలోగా భళ్ళున వాంతి చేసుకున్నాడు. తరవాత ఇంకోసారి కెవుక్కుమన్నాడు. గంగమ్మ వచ్చి సందిట పట్టుకోబోతే, ఆమెను బలహీనంగా తోసేస్తూ వొళ్లెరక్కుండా పడిపోయేడు. ఆ పడి-పోడం- సరిగ్గా అప్పుడైన వమనంలో పడ్డాడు.

★ ★ ★

"ఒలే! ఒలే బంగారి! యిట్రాయె గుడిసేటా!" అని ఒక్క సుగ్రీవ బొబ్బ పెట్టింది ఎర్రెమ్మ.

సంకురాత్రికి పెద్దల్నీ, పేరంటాళ్ళనీ, మూలకి తెచ్చుకునేసరికి పొద్దు బాగా వాటారి పోయింది ఇంటిల్లపాదీ అప్పుడే భోజనాలకు కూర్చున్నారు.

"ఇనపడదేటే; ఓ లీపరాల! యిట్రా" అంది బయటనుండి కేక, నారాయుడు లేవబోయేడు.

"నువ్వు లేవడాని కొల్లకాదు. పొద్దల్లా వుపాసఁవున్నావు. పెసాదం ముందు కూకుని లెగడం పెద్దల కపశారం. నా నెల్తానుండు" అంటూ చెయ్యి కడుక్కుంది బంగారి.

"నా మాటిని తొందరపడకు. నానొచ్చి మాటాడతాను. వుండమను" అన్నాడు నారాయుడు.

మెడనిండా గంధంతో, మెట్టలో యెర్ర గన్నేరుతో, వీరావతారంలా నిలబడింది వాకిట్లో ఎర్రెమ్మ. బంగారి చూరుకింద కనిపించగానే –

"ఔనె! రాత్తిరి నీ కొడుకు నెక్కడి కంపినావె?" అంది తలెగరేస్తూ.

"ఎక్కడికి పంపినానూ?" అంది బంగారి.

"ఎక్కడికీ పంపనేదా?"

"నువు సెప్పు".

"నువ్వే సెప్పు".

"ఎంచిందానివి నువ్వు!"

"నర్నానే సెపతాను. సెపితే సెప్పుతో కొట్టించుకుంటావా?"

"నావల్ల తప్పుయిన్నాడు నాను కొట్టించుకోనా."

"నీ వల్ల తప్పో. నీ కొడుకువల్ల తప్పో మొత్తానికి తప్పయ్యింది."

"తప్పయిన్నాడు – అలాగే."

"రాత్తిరి నీ కొడుకెక్కడి కెళ్ళినాడు? రాత్తిరి నీ కొడుకును యిద్దరు మనుషులు మోసుకు రానేదా?"

"ఏ వూరు కొడుకు – యే వూరు మనుషులూ?"

"నీ పెద్ద కొడుకూ, సిన్న కొడుకూ – నీ మూడో కొడుకును మోసుకొచ్చినారు " అంది ఎర్రెమ్మ.

"ఔను మోసుకొచ్చినారు."

"ఎక్కణ్ణుంచి మోసుకొచ్చినారు?" అంది ఎర్రెమ్మ మళ్ళీ.

బంగారి మాటాడలేదు.

"ఎందుసేత మోసుకొచ్చినారు?"

దానికీ జవాబివ్వలేదు.

"ఏం? నడ్డానికీ నీ కొడుక్కి కాల్లునేవా? నిన్నపొద్దున్నగ యెల్లిన మనిసి, పొద్దోయిందాకా యేఁవై పోనాడు? ఎతకడానికెల్లిన నీ పెద్దకొడుకు యెంతేల కొచ్చినాడు? జాఁవు రేత్తిరికాడ నీ పెద్దకొడుకు, నీ సిన్నకొడుకు లబ్బులు కొట్టుకుంట యెక్కడికి పారెల్లినారు? యెల్లినోలు అద్దరాతిరేల రగస్సంగ మోసికొచ్చినారేల? తాగేసి పడిపోతే అంత రగస్సెఁ వెందుకు? నీ పెద్దకొడుకు తాగుముచ్చు. నీ రెండో కొడుకు తాగుతాడు – అసలాడు తాగనే తాగట్ట, ఎన్నడూ తాగనోడు యియ్యాల ఎలా తాగినాడు; తాగితే, ఒక్కల్లు పొక్కాడ

తాగుతారు; ఓ సారా బట్టీకాడ తాగుతారు. యెవర్తో నంజ, అడుక్కున్న నంజ; పూరవతల పాకేసుకున్న నంజ; గుడిసేటి నంజ; పడిసేటి నంజ; అడ్డంవై నోడికీ ఆసించే నంజ! – ఆ నంజింటికెల్లి తాగడంవేంవి? అసలాడు అక్కడ కేలెల్లినాడు? దానికీ ఈడికీ సంబందంవేటి? ఆడి సుట్టంవ నెల్లినాడా? ఆడి వయసద నెల్లినాడా? ఈడి వయసేటి దాని వయసేటి? ఆ యేలప్పుడు నాయక్కడ ఉండవలసిన మనిషి దానక్కడ కెలాగెల్లినాడు? ఇదాడికి పుట్టిన బుద్దా నేక ఏ నంజేనా నేరుపుతోందా?"

అంటూ గుక్క తిప్పుకోడానికి ఆగింది ఎఱ్ఱెమ్మ. ఈలోగా మూగవలసిన జనమందరూ చుట్టూ మూగేసేరు.

"అయిందా యింకేంవేనా వుందా?" అంది బంగారి.

"ఏంవి? ఇది సాల్దేటి?" అంది ఎఱ్ఱెమ్మ.

"అవును సాల్దనే సెపుతున్నాను."

"అయితే అక్కడి కెందుకెల్లినాడో సెప్పు!"

"నా నెల్లమన్లేదు. ఎల్లినోడు ఆడు. ఆణ్ణడుగు."

"ఆణ్ణే అడుగుతాను. యిత్తలకు రమ్మను."

"ఆడు కంచం కాడ కూకున్నాడు."

"తిన్నాకే రానీ."

"ఏంవింట్లోకి రావా?"

"నీ కొడుకు నా యింటికొచ్చిన్దాక నీ గుమ్మం తొక్కను."

"అయితే అక్కడే వుండు" అంటూ లోపలి కెళిపోయింది బంగారి.

అవునే యెఱ్ఱి: నీకు పండుగా, పున్నం నేదేటే? అంటున్నారు బయట జనం. ఎఱ్ఱెమ్మ వాళ్ళమీద కూడా కలియబడుతోంది.

''అదొత్తినే రానేదు, జగడానికొచ్చింది'' అంటూ లోపలికెళ్ళిన బంగారి, పైడయ్య చెయ్యి కడిగేసుకోడం చూసింది. ఎందుచేత అనకుండానే, నారా యుడు చెప్పేడు–

"ఆడు పయానంవై పోన్నాడు"

"మల్లే ంవొచ్చింది?"

"యీ తగువుల్నాను పడలేనంటున్నాడు."

"ఇదేఁట్రోరయ్యా! అత్తమీద కోపం దుత్తమీద సూపిస్తావేఁట్రా యెల్లెల్లురా" అంది బంగారి.

"నువు మరీనే, ఆడసలే బేజారుగున్నాడు. దానిమీద అత్తల యెఱ్ఱెమ్మా యిత్తల నువ్వూ. యిద్దరికిద్దరూ ఓటే" అన్నాడు నారాయుడు.

ఈలోగా బంగారి రెండో కొడుకు తినడం అయ్యింది. "బ్రేవ్" మని తేన్చేడు కోటయ్య – అవతలకెళ్తూ.

ఒచ్చిన మనిషిని, వీడా అన్నట్టు చూసింది ఎఱ్ఱెమ్మ.

"మీ తమ్ముడింకా నెగనేదేటి!" అంది ఎఱ్ఱెమ్మ.

ఎటో పోతాడనుకున్న కోటయ్య ఆమె దగ్గరికే నడిచేడు.

"నువ్విక్కణ్ణుండీ నెగు" అన్నాడు తాపీగా.

ఎఱ్ఱెమ్మ తననసుకోలేదు!

"నువ్విక్కణ్ణుండి నెగు" అన్నాడు కోటయ్య.

'ఏంవీ?" అంది ఎఱ్ఱెమ్మ.

"ఇక్కణ్నుండి నెమ్మంటే!" ఒక్క గత్తురు గత్తిరేదు చుట్టూ జనంతోపాటు ఎఱ్ఱెమ్మ తుళ్ళిపడింది. తుళ్ళిపడుతూనే –

"ఓరి గండో!" అంది.

అనడంవే తరవాయి – గుభీ దుభీ దుభీ మని మూడు గుద్దులు గుద్దేడు. కిందపడ్డ మనిషిని ఎడాపెడా నాలుగు తాపులు తన్నేడు.

"ఇంక నెగు" అన్నాడు తలమీద కిసురుతూ.

"ఓలమ్మో.... ఓర్నాయినో...." అంటూ లేచిపోయింది ఎఱ్ఱెమ్మ.

"ఎల్లు" అంటూ ఆమె వెళ్ళవలసిన దారి చూపించేడు. ఆమె అలాగే, అయ్యా, అమ్మల్ని తలుచుకుంటూ – ఊగిపోతూ, జోగిపోతూ అల్లంత దూరం వెళ్ళింది. అక్కడినుండి వెనక్కి తిరిగి ఓరి అలాటి గండ.... ఓరి యిలాటి గండ... అంటూ వల్లాపన మొదలెట్టింది.

ఈసారి పేట జనంతోపాటు, వూరి జనం కూడా ఈవింత చూస్తున్నారు. కొంతసేపు ఆమె వల్లాపన విని, రెండడుగులు ముందుకేసేడు కోటయ్య –

"మల్ల రమ్మన్నావా? యింటి కెల్తావా?" అంటూ పొలికేక పెట్టేడు.

ఎఱ్ఱెమ్మ తిడుతూనే వున్నా నాలుగడుగులు వెనక్కెళ్ళింది. అక్కడ మళ్ళా తిరిగి మళ్ళా తిడుతోంది. ఈసారి వాడి పెళ్ళాన్నీ, తల్లినీ, వాడన్నదమ్ముల్నీ వరసపెట్టి తిడుతోంది.

కోటయ్య ఆమెను విడిచిపెట్టి లోపలికెళ్ళేడు. లోపల పైడయ్య ప్రయాణానికి సిద్ధమై వున్నాడు.

"ఎట్రెల్తా" అన్నాడు కోటయ్య గత్తురుతున్నట్టు.

పైడయ్య మాటాడలేదు.

"ఎల్తే, నువు నీ పెల్లం కాడకెల్లు – లేకపోతే దాన్నిక్కడికి తెచ్చుకో. ఏడుపుమొంవవేసుకొని ఎక్కడికో పోతావేటి?" అన్నాడు తుండుగుడ్డతో అరుగు దులిపి కూర్చుంటూ.

అతడి మొహం కందగడ్డలా వుంది. అతణ్ణి శాంతింప చెయ్యాలని నారా యుడికి మహా యిదిగా వుంది. కాని యేం వంటే యేంవవుతుందో అని భయ పడుతున్నాడు.

"నీకు సేతకాప్పోతే సెప్పు నాను తీసుకొస్తాను" అన్నాడు చప్పున లేచిపోతూ.

పైడయ్య మాటాడలేదు. కోటయ్య అకస్మాత్తుగా బయలుదేరి పోయేడు. ఈసారి నారాయుడు జడిసిపోయేడు.

"ఓరుండ్రా, అయ్య! దురితం తగదురా–" అంటూ వాకిట దాకా వెంట పడ్డాడు. కోటయ్య వినిపించుకోకుండా సాగిపోయేడు.

ఎర్రెమ్మను ఆమె యిద్దరి కూతుళ్ళూ చెరో రెక్కపట్టి ఇంటికేసి లాగు తున్నారు. ఆమె వల్లాపన ఆపకుండా రెండడుగులు వెనక్కి నడిచి, ఒకడుగు ముందు కేస్తోంది. మధ్య మధ్య కుడిచేయి పట్టుకున్న కూతుర్ని విదిలించి, బారలు సాచి సాచి తిడుతోంది. పెద్ద పెద్ద అంగల్తో కోటయ్య వాళ్ళ యింటికేసే నడుస్తున్నాడు.

"ఓ(లాయే! –" అంటూ కీచుమంది సన్నెమ్మ. ఎర్రెమ్మ కూడా చూసి నట్టుంది.– కూతుళ్ళకు లొంగిపోయింది. కాని యిల్లు చేరుకున్నాక, ధైర్యం పుంజుకుంది.

"ఏం? నా కూతురికి– అందం తక్కువ నెల్లినాడా! నా కూతురికి వయసు తక్కువ నెల్లినాడా! నా కూతురు కులం తక్కువ నెల్లినాడా! నా కూతురు గుణం తక్కువ నెల్లినాడా?..... ఏలెల్లినాడు. ఎందుసేతెల్లినాడు?" పిడికిలితో గాలిని తాటిస్తూ అడుగుతోంది – ఎర్రెమ్మ.

ఆమె ఆక్రోశంలో లోతున్న మాట నిజఁవే. కాని కోటయ్య కదేమీ పట్టడం లేదు. అతడి చూపులన్నీ సన్నిమీదే వున్నాయి. ఆ చూపు చూడగానే సన్నికి భయం వేసింది. ఆమె గబగబా లోపలికి పోయి తలుపేసుకోబోయింది. తలుపు పడలేదు.

"బయలెల్లు" అన్నాడు కోటయ్య గద్దిస్తూ.

సన్ని వణికిపోతూ బయటికి వచ్చేసింది.

"పద!" అన్నాడు దూరంనుండే.

వజవజ వణికిపోతున్న కూతుర్ని చూసి –

"ఓర్ బాబు శాంతించరా – నాయనా! కోటయ్య శాంతించరా!" అంటు న్నాడు సన్ని తండ్రి. అతడికి ఆయాసంతో నోట మాట రావడం కష్టంగుంది.

"నువ్వూరుకోర మాఁవా! నీకు తెల్దు" అన్నాడు కోటయ్య హెచ్చరిస్తున్నట్టు.

సన్నిని రెక్కపట్టుకొని చూరు కిందనుంచి లాగి ఒక్క తోపు తోసేడు కోటయ్య.

ఆ సరికి –ఎర్రెమ్మ చేసే రోదనతో ఆ వాడ వాళ్ళందరూ యిళ్ళల్లోంచి బయటికి వచ్చున్నారు. సన్ని చెల్లెళ్ళు కుఁయ్యో మొర్రోమంటూ అక్కని చుట్టుకున్నారు.

మరొక్కతోపు ముందుకు తోసేసరికి సన్నెమ్మ పరిగెత్తుకుంటూ అత్తారింటికి బయల్దేరింది.

వాడకట్టును వాకిళ్ళలో చూసిన ధైర్యంతో –

"ఓలమ్మ! యింటిమీద పడిపోనారే! ఓలమ్మ! నేనేం చేతునే ఓర్నాయినో!" అంటూ ఎర్రెమ్మ కూతురికి అడ్డం పరుగెత్తింది.

''నువ్వెల్లకు , నువ్వెల్లకు!'' అంటూ సన్నిని మళ్ళించబోయింది ఎర్రెమ్మ.

కోటయ్య వాళ్ళ మధ్యకొచ్చి – చెరో పక్కా తోసేసేడు. సన్నిని ముట్టుకోవ లసిన పనిలేకుండా – తుండుగుడ్డ ఆమె నడుంకు చుట్టి గొరగొర యీడ్చుకు పోతున్నాడు. కిందబడ్డ ఎర్రెమ్మ లేచి వెంటబడి, కొట్టి, రక్కి, కరవబోయి, దుమ్ము చల్లి, ఆపబోయింది. ఊరువాళ్ళు – ఊరంచున నిలబడి చూస్తుంటే, రెండు వాడల వాళ్ళూ కొందరు – విడిపించడానికి పరిగెత్తేరు. అడ్డుపడ్డ వాళ్ళనందర్నీ పక్కకు తోసేస్తున్నాడు కోటయ్య.

తుండుగుడ్డలో పట్టితెచ్చిన మరదల్ని ఎదురుగా వస్తున్న తల్లిమీదికి విసిరి, గుడ్డ దులుపుకొని వెళ్ళిపోయేడు కోటయ్య.

అత్తను చూడగానే బావురుమంటూ చతికిలపడ్డ సన్నెమ్మను పొదివి పట్టుకు లేపింది బంగారి. "నీకేం బయఁవే! – ఓలి గుంట నీకేం బయఁవే?" అంటూ కోడల్ని యింటికేసి నడిపించుకు పోయింది.

ఎర్రెమ్మ అక్కడే చతికిలపడి ఏడుస్తోంది.

వాళ్ళటూ వీళ్ళిటూ కాగానే జనం పోగులుపడి పదుగురూ పది మాట లంటున్నారు.

''మొదట అది యింటిమీద కెల్లింది. యిప్పుడు ఈడొచ్చినాడు" అంటున్నా రొచోట.

"ఆడది ఎల్లి జగడాలాడిందానికీ, మొగోడు యింట్లో సొరబడ్డదీ ఒకటేనా?" అంటోంది పెద్దమ్మ.

"ఎంత సొంత మరదలైనా – యింకో ఆడదాన్ని పదిమందిముందూ రెక్కట్టుకు నాగడం నానెక్కడ సూడ్నేదు" అంటోంది ఓ ఆడబడుచు.

"అదే దాని మొగుడైతే తప్పునేదుగాని, ఈడా దాని బావకదా ఒంటిమీద సెయ్యెయ్యడం తప్పా? తప్పున్నరా!" అంటున్నాడో పెద్దాయన.

''అది ఆడముండైపోయి, దాని మొగుడు అవిటోడవబట్టిగాని ఒక్కొడుకుంటే – పుచ్చి లెగిరిపోను" అంటోంది ఓ వుడుకు నెత్తురు.

అలాటి సమయంలో, దుమ్ములపండక్కి మంచి వేటపోతును తెచ్చుకొనే సన్నాహంలో, బారికిని పిలవడానికి బయల్దేరేరు అసిర్నాయుడుగారు. అల్లంత దూరం నుంచే, యీ గలాటా అంతా గమనిస్తున్న నాయుడు అక్కడకొచ్చి – ''సంగతేఁవి'' టన్నాడు. ఊళ్లో వాళ్ళెవరూ సరిగా చెప్పలేకపోయేరు. అప్పుడాయన బారికి పాపయ్యను కేకేసేడు.

"అవున్రా? అక్కడేటా గలాటా?" అన్నాడు నాయుడు గారు. పాపయ్య రెండు ముక్కల్లో సారాంశం తేల్చేశాడు.

"దాన్నీడ్చుకెళ్తున్నవాడు దాని మొగుడు కాదా?" అన్నాడు కోపంగా నాయుడు గారు.

"కాదు. అది రెండో అన్న – కోటయ్య."

"పిలా తొత్తుకొడుకుని" అన్నాడు నాయుడు. బారికి కదల్లేదు.

"రాకపోతే జుట్టట్టు కీడ్చుకురా" అన్నాడు అంతకంటె గట్టిగా.

"సిత్తం!" అన్నాడుగాని అప్పటికీ కదల్లేదు.

నాయుడికి అనుమానం వేసింది.

"ఏం ఆడు తాగుతాడేట్రా" అన్నాడు ఈసడిస్తూ.

"ఈ ఉడుకులేవో తగ్గేక, ఇంకోగంటకి ఆలే తఁవ పాదాలకాడ కొస్తారు గదా! ఈ లోపట్ల మనం తగువేసుకుంటే – యెంకయ్యపాలెం యెల్లడఁవెప్పుడు? పోతును తేవడఁ వెప్పుడు? ముందెల్లి ఆ పని చూస్తే కాదా!" అన్నాడు పాపయ్య నేర్పుగా.

నాయుడి గారిక్కూడా – ఆ మాటల్లో నిజం కనిపించింది.

"తొత్తుకొడుకులు! వొళ్ళు కొవ్వెక్కి తెగ బలిసున్నారు. కన్నూ మిన్నూ కానక కొట్టుక సస్తున్నారు" అని గొణుక్కుంటూ బారికి పాపయ్య వెంటరాగా, వెంకయ్యపాలెం కేసి వెళ్ళిపోయేరు.

★ ★ ★

"మన తిండి మనం తిని, మన బతుకు మనం బతికిందికి ఆడికాడా ఈడికాడా అదువెందు" కంటారు నారాయుడి తమ్ములు. ఆ అదువే లేప్పోతే బారికి అద్దే పడప్పోతే, ఆ కథ ఎక్కడి కెళ్ళునో వాళ్ళు గ్రహించలేరు.

పాపయ్య చెప్పినట్టే ఒగ్గంట గడిచేసరికి పేట చల్లబడింది. చెరో పక్కా యిద్దరి భుజాలు సాయం చేసుకొని, ఎర్రెమ్మ నాయుడుఁగారి యింటి కెళ్ళింది. ఆవె వెంట పది పదిహేనుమంది ఆ పేటవాళ్ళు సాఁయం వెళ్ళేరు. పేట తాగుబోతుల సంఘం గజ్జకట్టి, తప్పిడి గుళ్ళు తగిలించుకొని డబ్బుల కోసం వూరిమీద పడ్డారు.

బంగారమ్మ యింట్లో పెరటి పంచను కూర్చుని, సన్ని – అక్కుర్లు బుక్కుర్లేడ్చి అలసిపోయింది. మొహం కడిగి, కొత్తకోక కట్టుకోమని బంగారి నయానా భయానా చెపుతోంది. నాయుడికి కోపం వచ్చిన సంగతివిని, కోటయ్యను అత్తారింటికి పొమ్మని నారాయుడు బలవంతం చేస్తున్నాడు. అతడావూరు దాటాడో లేదో – ముగ్గురన్నదమ్ముల్నీ రమ్మని పిలుపొచ్చేసింది.

బారికి పాపయ్య చెప్పిన సలహా పాటించి పైడయ్య నింట్లోదాచి నారాయు డొక్కడే బయల్దేరేడు. నాయుడిగారి లోగిలి చేరగానే – నారాయుడ్ని గోడ పక్కనుంచి "నాను మాటాడ్డఁవైనాక, ఒక్క సిటం ఆగి అప్పుడు రా" అంటూ బారికి లోనికెళ్ళేడు.

అప్పటికప్పుడే పొద్దుగుంకి పోయింది. మంద నుండొచ్చిన పశువుల్తో దొడ్డంతా హడావుడిగా వుంది. నాయుడు గారొచ్చారని తెలిసి తప్పిడిగుళ్ళ వాళ్ళు రెండోసారొచ్చేరు. ఎర్రెమ్మా, జనం, ఓవార కొసిలుకున్నారు. వరండా అంతా, తప్పిడిగుళ్ళ ఆట చూసే జనంతో – ఆలగోడు బాలగోడుగా వుంది.

బారికి బయటకొచ్చి – చెప్పవలసేది మరోసారి చెప్పేడు నారాయుడికి.

తప్పిడిగుళ్ళ వాళ్ళు వెళ్లిపోయాక –

"బాబో బాబు!" అన్నాడు అసిరయ్య గారితో బారిక పాపయ్య.

ఆయన తల తిప్పగానే మనవి వినిపించేడు.

"నారాయుడొస్తున్నాడు. ఆళ రెండో తమ్ముడు – అంటె ఎర్రెమ్మ అల్లుడు – ఆడెక్కడికో యెల్లినాట్ట, రాగానే తోల్తానన్నది ఆలమ్మ. మరొచ్చి ఆ నడిపోడు అత్తారింటి కెలిపోనాడు. రేపు కనుం గదా?" అన్నాడు అందులో వింతేమి లేదన్నట్టు.

"నడిపేసినారు! నాన్సెప్పనేదా? దాటించీసినారు!" అంది నరసమ్మ ఏడుపు మొహంతో.

"నువ్వుండే, అసలోలకి లేనిబాధ అంతల పొంత లోలికట – నువ్వూరుకో" అన్నాడు బారికి.

"అవును. ఆళ్ళూ మీరూ బాగార్లుకాదా? కోపం వొస్తది" అంది నరసమ్మ. నాయుడిది వినిపించుకోలేదు.

ఇంతలో, "బాబ్బాబు దండాలెడతాను" అంటూ దిగేడు నారాయుడు. అతడెంత వినయంగా కనిపించినా, అతణ్ని చూస్తూనే అగ్గి రుద్రుడైపోయేడు నాయుడు.

"అవున్రా తొత్తుకొడుకా! మీకేం వొల్లుకొవ్వెందేట్రా – కాదు మీకేం వొల్లు కొవ్వెందా? ఆడముండ అనువన్చెప్పి, దానింటి మీదికెళ్ళి దాన్ని తంతార్రా? యిదేం వూరనుకున్నారా అడివనుకున్నారా?...."

"బాబు! నానందులో లే"నన బోయేడు నారాయుడు.

"ఛాఫ్? తొత్తుకొడుకు మళ్ళా మాటాడుతున్నాడూ?! కొట్టిన దెబ్బలు కనపడవా? సాక్షం రాదనుకున్నావా?" అన్నాడు కూచున్న చోట్లోంచి లేచిపోతూ నాయుడుగారు.

నారాయుడికి యేం చెప్పాలో బోధపడలేదు.

"ఓ రొల్లకోరా! బాబాతన్న యెల్తా – అంతా చూసినాడు"

అన్నాడు బారిక పాపయ్య.

నారాయుడు ఆ సైగ గ్రహించి నోరుమూసుకున్నాడు. అతడూరు కోవడం చూసి నాయుడు చెప్తున్నాడు –

''నేన్నూన్నానే వున్నాను. లంజకొడుకు పశువు నట్టికెళ్ళినట్టు ఆడదాన్ని బజార్లో ఈడుస్తున్నాడు. నా చేతిలో కఱ్ఱ లేకపోయింది. వుంటే తొత్తుకొడుకును – ఏ కీలు కాకీలిరిచేసి, ఆర్నెలు ఆసుపత్రిలో పారేద్దును. ఇప్పుడైనా ఆ తొత్తుకొడుకు రావాల. అడిపని పట్టాల?" అంటూ వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

కొంచెం మంట చల్లారనిచ్చి "నిజవే తప్పైపోనాది" అన్నాడు నారాయుడు. అని –

"అదే ముందరొచ్చి రేపెట్టింది. లేప్పోతే యింత రగడ జరగప్పోను. ఉదయం నించి వుపాసాలొకటి. ఇలాగ కంచంకాడ కూకున్నాం.కందిరీగ నాగ పారొచ్చింది. ఆకాడకీ మాయమ్మ దానికి జవాబియ్యకండ లోపలి కొచ్చేసింది. మాతమ్ముడు కదా! సిన్నోడు – తరకం కాసుకోనేప్పోయేడు. ఇయ్యాలే కాదు నెల్లాలనించి యిదేపోరు. మాటాడితే యింటిమీది కొచ్చేస్తాది. వొద్దే అంటే యినదు" అంటూ యెదురు నేరం ఆరోపించేడు.

ఎఱ్ఱమ్మ ఏదో అనబోతే, నాయుడు ఆమె నోరు మూయించేడు.

"యింటిమీదికొస్తె నాతో చెప్పాల. అంతేగాని దానింటి మీద పడ్డంవా?" అన్నారు నారాయుడితో.

"సిత్తం సిత్తం. అది తప్పే!" అన్నాడు నారాయుడు. తప్పొప్పుకున్న వాళ్ళని, ఎవరూ యేం చెయ్యకూడదు కదా– అంచేత నాయుడు కూడా శాంతించేడు.

తరువాత అక్కడున్న నాయుడి భార్యా; ఆమె పొరుగింటి సుబ్బమ్మగారూ; నాయుడిగారికి సీనీపంచదార తెచ్చిన సెట్టీ; ఆరికి కాళ్ళు పట్టడానికొచ్చిన మంగలెంకయ్యా – పదిమందీ, పదేసి మాటలన్నారు. అందరూ, "దురితం కూడద"న్నారు. అందరూ, "దౌర్జన్యం పనికిరా"దన్నారు. ఒక్కరూ దురాగతం తగునన్లేదు. తగువులొస్తే తమలో తాము తన్నుకోడం కాదు, తగిన పెద్దల ముందు పెట్టి పరిష్కారం చేయించుకోవాల. కోపతాపాలకేం అందరికీ వుం టాయి. అది అణుచు కోవడంలోనే వుంది పెద్దమనిషి తరహా –

నారాయుడు అన్నిటికీ – "అవునమ్మా! ఔను బాబు! సిత్తం. సిత్తం" అంటూ తలూపేడు.

అంతా అయ్యేక నాయుడుగారు శాంతించి అడిగేరు.

"ఇప్పుడా గుంటెక్కడుంది!" అన్నాడు నారాయుడితో.

"మాయక్కడేవుంది బాబు" అన్నాడు వినయంగా.

"ముందు దాన్ని తీసికెళ్ళి దాని తల్లి కప్పగించు. రేప్పొద్దున నువ్వూ నీ తమ్ముడూ రండి. అదీ దాని కూతురూ వస్తారు. సంగతేటో సందర్భంవేటో అప్పుడేదో అడిగి చెపతాను" అన్నాడు – నాయుడు.

బతుకు జీవుడా అనుకుంటూ, "సిత్తం సిత్తం" అన్నాడు నారాయుడు. ఎర్రెమ్మ తరపు మనుషుల మొఖాలు వేలాడగా – నాయుడు కుర్చీలోంచి లేచిపోయేడు. రెండడుగులు వెయ్యనిచ్చి –

"బాబో అసలు మనిషి నొగ్గేసినావ్!" అంది నరసమ్మ బితుగ్గా.

"అన్నట్టు మీ యమ్మను కూడా తీసుకురా" అన్నాడు. దాంతో రెండో పార్టీ మొహాలు కూడా పైకి లేచేయి.

సిరిగల పండుగ, చీకటి రాత్రి వస్తుందంటారు పెద్దలు. ఇది సిరిలేని పండుగ – కాబట్టే వెన్నెల రాత్రి తగలడిందట.

నాయుడేం చెప్పాడో తెలుసుకోడానికొచ్చిన జనంతో, యింట్లో నిలబడ్డానికి కూడా చోటు లేకుండా పోయింది. వాకిట్లో మంచం వాల్చుకొని అక్కడ కూర్చున్నాడు పైడయ్య.

కొంతసేపు పోయేక ఒక్కొక్కరే బయటకొస్తున్నారు. ఆఖర్న అయిదారుగురితో సన్ని కూడా వచ్చింది.

తెల్లని వెన్నెల్లో – తెల్లన కాకపోయినా తెల్లగా కనిపించే పసుపుకోక, నల్లని కొప్పులో – నలుపు కాకపోయినా నల్లగా కనిపించే యెఱ్ఱబంతి పూలు. నారాయుడు వెంట నడవగా అతడి ముందునుంచే నడిచిపోతుంది సన్నెమ్మ.

అల్లంత దూరాన అవేవో నీడల్లా నిలబడ్డారు. ఆమె తాలూకా మనుషులు. చిన్నప్ప ఎక్కడిదాకా లాక్కొచ్చాడో –అక్కడిదాకా పిల్లని అంపకం పెట్టి తిరిగి వచ్చేడు పెద్దన్న.

★ ★ ★

అసిర్నాయుడుగారు కుద్దిరంగా కుంచంవంత మనిషి. గట్టిగా తూద్దంవంటె సేరుసితకలుండవు. మరా బెమ్మ యెక్కడ దాసినాడో పవరు. నోరిప్పినా, పంజాయిసిర్నా పులి. అతడంటే భయంవూ, భక్తీ వున్నాయి జనానికి.

పండు తమలపాకులాంటి లక్ష్మీకరమైన కళలతో, కలవారి ఆడబడుచు కాపురాని కొచ్చిన్నాదే ఎత్తుకుంది సిరి. ఎక్కడెక్కడ అంవిర్చిన భూంవులూ, సొంత సేరీ కిందకి లాగేడు. రత్న శలాకల్లాంటి యిద్దరాడ పిల్లలకీ రాజా ల్లాంటి సంబంధాలు చేసేడు. ముగ్గురు కొడుకులు – పెద్ద పెద్ద పట్టణాల్లో చాలా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. నాలుగోవాడు అందరికన్నా చురుకట. పై దేశాలు పోవచ్చంటారు.

"అదురుష్టంవంటే నీదయ్యా అసిరి బావా? కడుపులో చల్ల కదలకుండా, ప్రభుత్వం వారి ఖర్చుతో నలుగురు పిల్లల్నీ

పెద్ద చదువులు చదివించేవు. వాళ్ళ సంపాదనమీదా, కట్నాలమీదా తక్కువలో యెక్కువ కిమ్మత్తు చేసే ఇద్దరల్లుళ్ళను పట్టుకొచ్చేవు. వూర్లో పలుకుబడికి పలుకుబడి. ఎన్నాళ్ళు తిన్నా అరగని తరగని ఆస్తి. అవిఁరితే అలాగన్నీ అవఁరాల!" అంటాడు లోకల్ యమ్మెల్లేగారు.

అతడికి యెప్పుడేనా నాయుడు తనకు పోటీ కావచ్చన్న భయం ఉంది. అది నిజంగా అనవసరమైన భయం.

అసిర్నాయుడు గారికి రాజకీయాలంటే కిట్టవు. ఇవన్నీ పెద్దా చిన్నా చెడి పోడానికే వచ్చేయంటాడు. ఆయనా ఒకప్పుడు గాంధీ శిష్యుడే – యిప్పటికీ ఖద్దరే వేస్తాడు. అయితే గాంధీతోనే అతని రాజకీయాలూ అంతరించేయి.

ఇప్పుడతనికి అతని వూరే రాజ్యం. అందులో ప్రజల బాగోగులే అతని రాజకీయాలు. ఆ ప్రజలు తమలో తాము కలహించుకోకుండా, ధర్మమార్గాన నడుస్తూ, నీతిగా బతకడమే అతన్నిక్కావలసింది. "బ్రతుకు యివేళుండి రేప్పోయేది. ధర్మం కలకాలం నిలిచేది. దాన్ని తప్పితే లోకం తలకిందులు కాదా?" అంటాడాయన.

ఆయన మాటలకందరూ తల వూపుతారు. ఆచరణ కొచ్చేసరికి మరిచి పోతుంటారు.

నాయుడుగారు దేన్నైనా సహించగలరుగాని, రెండు సహించలేరు. ఒకటి దొంగతనం, రెండోది దౌర్జన్యం.

"తొత్తుకొడుకుల్లారా! మీకు తిండికి లేకపోతే అడుక్కు తినండి. బిచ్చం దొరక్కపోతే; చావడమైనా మేలు. అంతేగాని, దొంగతనం చేస్తే యిహానా, పరానా చెడతార్రా. మీకు బుద్ధెందుకు లేదూ?" అంటారు.

కన్నగాడు కన్నంవేస్తే అందులో కొంత ఘనతుంది. కొంత కష్టం కూడా వుంది. అంచేత దాన్ని సహించవచ్చు. చేల్లో దొంగతనం మాత్రం అలాటిది కాదు. కృషి కర్మ అన్నది నమ్మికమీదా, మనిషిమీద మనిషికుండే విశ్వాసం మీదా సాగాలి. ఎంత మందీ మార్బలం వున్న రైతుకైనా అహర్నిశలూ కాపు కూచోవాలంటే సాధ్యం కాదు. అంచేత ఆ రకం దొంగతనం రుజువైందంటే యింక వెనకా ముందు చూడడు.

"తొత్తుకొడకా! నీ యమ్మగారి సొమ్మనుకున్నావా? నీ బాబుగారి సొమ్మను కున్నావా? ఆ యెవసాయం నువ్వెట్టినావురా?" అంటూ పులుసులోకి ఎఁవిక లేకుండా రోలేసి ఫో లంజాకొడకా! పొమ్మంటాడు.

అక్కడికీ దొంగతనాలు జరుగుతూనే వుంటాయి. కొన్నిటిని చూడనట్లు వదిలి; కొన్నిట్టి గట్టిగా పట్టుకొని; కొన్నిట్ని కూకలేసి పొమ్మని, ఆర్నెల్లకీ ఏడాదికోసారి పంజా విసిరి హడలగొడుతూ, అలా తీసుకొస్తున్నాడు.

అలానే దౌర్జన్యాల విషయం కూడా. అతడు వాటిని చాలా పట్టుదలగా అణుస్తాడు.

మీకూ మీకూ తగూవస్తే, వూర్లో గ్రామాధికారులున్నారు? మా మీద విశ్వాసం లేప్పోతే పోలీసులూ, కోర్టులూ వున్నాయి. అంతేగాని తమకు తాము పెద్దలై తన్నేసుకుంటామంటే, ఆ దౌర్జన్యవేఁటో నేనూ చూస్తాను అంటాడు నాయుడు. చూసేడో అంతుచూసేడే!

దౌర్జన్యం అంటే అంత కోపం కాబట్టే నిన్నటిదినం కోటయ్యచేసిన జులుంకి ఆయనకు అంత వొళ్ళు మండింది. అందుచేతే ఇవేళ పండుగైనా ఆయన తగువుకు పిల్చేడు.

అన్నాడుగాని, ఆ ఉదయం అతనికి తీరిక కాలేదు. మధ్యాహ్నానికి కూడా నసుగుతుంటే పాపయ్యన్నాడు –

"బాబూ, వుదయవఁల్లా ఆ మాలోల్లకి అగ్గుల్లేవు. తఁ వరెయ్యేలకి పిలుస్తారో అని, అలక్కాసుక్కూకున్నారు. మరీ మద్దేనఁవైన ఆ తగువేదో తెల్లార్చకపోతే, రేపొగుంటడు పట్టం పోవాల."

"సరే, అంబళ్ళేల దాటేక పిలు" అన్నాడు నాయుడు.

ఆ వేళకు ముందునుంచే తొందరచేసి, ఒక్కొక్కళ్ళే లోగిలికి తోలుకొచ్చేడు పాపయ్య. బాబు బయట్నుండి వచ్చేసరికి బాగా పొద్దోయింది. ఈలోగా వాకిట జనం – పడిగాపులు పడీ పడీ – వాకిట కూర్చున్నారు. బారన్నర పొద్దుందనగా వచ్చి –

"ఔన్రా బారికి! అందరొచ్చేర్రా?" అంటూ లోపలికెళ్ళి పోయేడు నాయుడు.

ఆయన కాఫీ తాగి బయటకొచ్చే సరికి అందరూ సర్దుకు కూర్చున్నారు. నాయుడుగారు కుర్చీ లాక్కొని కూర్చున్నారు.

ఆయన కెదురుగా ఓ వార నారాయుడూ, అతడివెనక తల్లీ కూర్చున్నారు. తల్లి పక్కనే, పట్నం వేషంలో పైడయ్య గొంతు కూర్చున్నాడు. ఆ వెనక యిద్దరాడాళ్ళు నిలుచున్నారు.

రెండోవార – ఒంటినిండా పట్లతో, తలకో గాయం కట్టుతో ఎర్రెమ్మా – పక్కన ఆమె కూతుళ్ళిద్దరూ కూర్చున్నారు. వాళ్ళవెనక పొరుగు నరసమ్మా, ఇంకో నలుగురు ఆడా, మగా నిలుచున్నారు.

"ఆళ్ళంత యెవరే?" అన్నాడు నాయుడు.

"సాచ్చుకులు బాబు! సాచ్చుకులు" అంది నరసమ్మ.

"దానికి నోర్లేదటే! అవునే ఎర్రెమ్మ! ఆల్లంత దేనికి?" అన్నాడు తలెగరేస్తూ.

"నిన్న నన్ను తన్నినారు గదా–? ఈ పట్లని సూడు. ఈ దెబ్బల్సూడు. ఏ కీలు కాకీలు యిడిపోనాది–"

"మంచిపనయ్యింది లంజా. అంతకన్న ఆ నోరు నొక్కేస్తే

బాగుండిపోను. ఆ తొత్తుకొడుకు కీళ్ళిరిసేసినాడుగాని, తెగని కత్తట్టుకొని ఆ నాలిక్కోసేవలిసింది. నేనైతే ఆ పన్సేదును." అన్నాడు నాయుడు.

నారాయుడి తరుపు ఆడవాళ్ళు తలలు పక్కకి తిప్పుకొని ముసిముసి నవ్వుల్నవ్వేరు.

"బాబూ బాబు! నువ్వలాగ అలుసిస్తే, ఆలు మరీ మితిమీరిపోరా?" అన్నాడు – ఎనకనుండి ఎఱ్ఱెమ్మ మనుషుల్లో ఒకడు.

"ఛాఫ్ తొత్తుకొడుకుల్లారా! మీ యిరుగు పొరుగులు చేరే, అయిన వాళ్ళకీ కానివాళ్ళకీ తగువులు పెంచుతుంటారు. లేప్పోతే, నిన్నటికి నిన్న తీర్చి పొమ్మన్న తగువుకి మళ్లా యియ్యేళ సాక్షేలూ, ఋజువులూ తెస్తారా?" అన్నాడు నాయుడు. దాంతో అందరూ నోరు మూసుకున్నారు. "నిన్న నువు తీర్చిన తగువేటి? నువ్వెట్టిన సీవాట్లు నీకాడే వున్నాయి. నాదెబ్బల్నాకాడే వున్నాయి." అనాలనుకుంది ఎఱ్ఱెమ్మ. కాని అప్పటికే ఆయన వేడిమీదున్నాడు. ఏఁవంటె యేం తిడతాడో అని వూరుకుంది.

కొంచెం సేపు పోనిచ్చి, శాంతించిన గొంతుతో అన్నాడు.

"ఔనఱ్ఱా, నేను చూస్తూనే వుంటాను. మీ మాలపేట్లో రోజూ యే వారో ఓ వార, యెందుకో ఒకందుకు తిట్టుకుంటూనే వుంటారు కదా! ఎందుకోసఁవలా తన్నుకు సస్తారు? ఏం మీకు పంచుకుందికి ఆస్తులున్నాయని తన్ను కుంటారారా? కలువు కుందికి భూఁవులున్నాయని తన్నుకుంటారా? లేకపోతే ఒక నీటికాడ తగువా? ఒక దారికాడ తగువా? దేనికి మీ తగువులు?"

అంటూ, తగువుకొచ్చిన జనఁవంతా తలొంచుకున్న దాకా చూసేడు. అప్పుడు తన వుపోద్ఘాతం యింకా సాగించేడు –

"ఏదో భగవంతుడు మీ కింత రెక్కలిచ్చేడు. పదిమందీ పస్సోలలు ఒక్కనాడు తెచ్చినా, పదిరోజులు గంజితాగి గడిపేసుకోగఁలు. అలాగప్పుడు నలుగురూ కలిసి మెలిసుంటే అదెంత హాయి. యిలా తెల్లారిలేస్తే తగువులు పడ్డం – యిదేం సుఖఁవు? మీకు మతులుండవా? లేకపోతే, అందులో ఏదో పురుగుండి అలా దొలుస్తుంటుందా?"

ఏం చెప్తారా జనం? యేం చెపితే నాయుడికి బోధ పడుతుంది!

"అందుచేత నా మాట విని తగువులు పెంచుకోకండి. వున్న తగువులు తుంచుకోడం నేర్చుకోండి."

"అని, అసలు – తగువుకి మూలకారణం చెప్పమన్నాడు నాయుడు.

ఎఱ్ఱెమ్మా, ఎఱ్ఱెమ్మ తరపున వచ్చిన మనుషులు కూడా తగువు గురించి సరిగా వివరించలేకపోయారు. వాళ్ళెంతసేపు చెప్పినా ఎవరు, ఎవరితో, ఎప్పుడేం అన్నారో – దానిమీద ఎవరు, ఎందుకు, ఏవని యేం చేసేరో – చెప్తారే తప్ప, నాయుడికి కావలసినట్టు దాన్ని చెప్పలేకపోయేరు. అప్పుడు నారాయుడే యిరుపక్షాల వాదనా చేతనైనంత నిష్పక్షపాతంగా వివరించేడు.

నారాయుడు చెపుతుంటే – నాయుడు కొంత విన్నాడు; కొంత వినలేదు. వెంకయ్యపాలెం వెళ్ళే దారిపొడుగునా బారికి పాపయ్య యేం చెప్పేడో, ఇప్పుడు అదే చెప్తున్నాడు నారాయుడు. అంచేత అయ్యేక –

"అయితే అదఱ్ఱా తగువూ?" అన్నాడు నాయుడు.

"అంతేకాని బాబు యింకొక్కటుంది" అంది నరసమ్మ. "అట అట కబుర్లే గాని నా సెవులుతో నా విన్లేదు. కాని బంగారమ్మ ఒక్క మాటందట. ఏం జూసుకొని దాని మిడిసిపాటో నాకు తెలీకుండున్నాది. నానియ్యేలే సెపుతున్నాను. ఏడాది తిరగకండ నా కొడుక్కి మరో మనువు సెయ్యకపోతే నా పేరు బంగారే కాదు – అందిట. అది ఇన్నాకే ఎఱ్ఱెమ్మ కూపీల్నాగడం మొదలయ్యింది. ఏఁవి విన్నాదో నిన్న ఆలింటి మీదికి బయలెల్లింది. ఎల్లిందేవో వాళ్ళు పులాగ్గా తన్ని పంపించినారు" అంది నరసమ్మ.

బంగారి ఏదో అనబోతే ఆమెనాపి నాయుడడిగేడు.

"అవునే నీ పేరు నరసమ్మా?"

"........................."

"నువ్వు ఎఱ్ఱెమ్మ తరుపు ప్లీడరవా, సాక్షివా!"

"........................."

"కాదు. నీకది వకాల్తా యిచ్చిందేటే!"

''బాబూ బాబ''ంది ఎఱ్ఱెమ్మ. అని ''నానే దాన్ని మాటాడమన్నాను. మాటాడ్డానికి నా నోరు మంచిది కాదు. అసల్నాకు ఓపికా నేదు."

"నీకు సంకటం?" అని యీసడించి ఒక్క క్షణం పోయేక సన్నెమ్మ కేసి చూస్తూ అన్నాడు.....

"అవునే దాని కూతురెవరు నువ్వా?"

"సన్నెమ్మ ఔనంది.

"నీ పేరేం పేరు?"

"సన్నెమ్మ చెప్పింది.

"మీ ఇంటిపేరు?"

సన్ని తన అత్తారింటి పేరు చెప్పింది.

"అవునే యెఱ్ఱి, మీ ఇంటిపేరు? అన్నాడు నాయుడు.

"నీకు తెల్దేటి?" అంది ఎఱ్ఱి.

"చెప్పు లంజా"

"వెంటనే ఎఱ్ఱెమ్మ చెప్పేసింది.

"అవునుగద? కాబట్టి – అది పూర్వం యెప్పుడో నీ యింటి మనిషైతే కావచ్చు. ఇప్పుడు నీ పిల్లకాదు –

"దానిష్టఁవైతే దాని మొగుడిష్టవైతే వొస్తాది. దాని మొగుడికీ, అత్తకి యిష్టఁవైతే పంపిస్తారు, లేకపోతే లేదు. నా పిల్లన్నేను తీసుకుపోతాననడానికి, నీకు న్యాయం ప్రకారం యే హక్కూ లేదు. ఇంక నోరుమూసు కూరుకో" అన్నాడు నాయుడు.

ఎఱ్ఱెమ్మ కంట్లో తిరగాడడానికి నీళ్ళు లేవు. ఆ పొడి కళ్ళతో అలా నాయుడికేసే చూస్తోంది.

"నీక్కావలంటే, యేదో ఆళ్ళని బతిమాలి తీసికెళ్ళు, లేదా నీ కూతురు మనుఁవొగ్గు కుంటుందేవో చూదు."

చివరిమాట గట్టిగా విన్పించేసరికి నారాయుడికే కష్టఁవైనట్టుంది.

"బాబూ! అదేం మాటగాని – 'కనుక్కున్న తల్లికి లేని హక్కు! కానీ కండె కట్టినోడికా?' అని మాలో సాఁవెతుంది. దానక్కు దానికీ వుంటది.మాయక్కు మాకూ వుంటది? ఆడపిల్లున్నదంటే ఇద్దరికీ అక్కులుంటాయి. మాం కాద నఁవు. – " అన్నాడు నారాయుడు వుదారంగా.

"కాకపోతే, కడుపు మంటకొద్దీ ఈ గోలంతా లేపినాది. ఎఱ్ఱెప్ప యేటను కుంటాదంటే, దానికి నలుగురు కొడుకులూ, యిద్దరు కోడళ్ళూ గదా – నా కొక్కదాన్ని యిస్తే తప్పా. నా పిల్లేగదా – అనుకుంటాది. కాని, బాబూ! ఎంత సెట్టు కంతగాలన్నారు.

మా తండ్రినాడు, తఁవరు మాకో మడిసెక్క వొరకట్టుకోమన్నారు – ఆ సెరువు గర్భంలో వొరకట్టిన ముక్క. అదో పాతిక సెంట్లుంటాది. అది మా పానానికి రాజుగారి యేనుగై పోనాది. అది వొట్టి గొడ్డునాగ యెక్కళ్ళేందీ మింగడఁ వేగాని సేపడం కనబడదు. వొద్దే అంటె, మాయమ్మా, సిన్న తమ్ములిద్దరూ యినిపించుకోరు. అప్పుతెస్తే – అందరి బంజెర్లనాగే అదీ ఆరిపోద్దని మాయమ్మ బయ్యం. అందుకని గడించనానికి బయలెల్లినాడు మా రెండో తమ్ముడు.

అక్కడాడు కష్టాలుపడ్డఁవే కనపడుతోంది గాని, కానీ మిగిలింది కనపడదు. ఆడికి కాలూ సెయ్యి నొచ్చినా, మాకిక్కఁదేవైనా, మా తను పల్ల ఆడిమీదే వుంటాది. పోనీ కాపరఁ వెట్టిద్దావంటె తెచ్చింది సాల్దు. సాల్తే యిక్కడకు పంపనేదు. అదీగాక మా మరదలు లోకంనాటి పిల్లగాదు. సిన్న పిల్ల. అమాయకురాలు!

ఇన్నాలోసించి, ఒద్దర్రా; ఇవి నిలబడ్డానికి రోజులుకావు. బదకడఁవే కష్టంగున్న రోజులు. కలో గంజో తాగి ఇక్కడే పడుందాఁవంటె మా తమ్ములి కోపఁవు. మనవేఁటి యెకరా లొరకట్టిఁనావా! గరిశల పండిస్తావన్నాఁవా? కూల్లు పడిపోతున్నాయి. కాని కాలఁవొస్తే, కలో గంజో తాగి పానాలు నిలుపుకోనానికి ఆ మాత్రం ఓ సెక్క సేతులుంటే, అందరం కాకపోతే కొందరఁవైనా బ్రతఁకవా – అంటారు. గాలీవానొస్తే కతేలేదని ఆలకి తెలదు.

ఇదుగో, యేదాదీమద్దె ఆలకి నా మాటల్లో నిజెం కసింత తెలుస్తోంది. యింకా ఈ వొక్కేడు సూత్తుం. ఈ వొక్కేడు సూత్తుం అన్నట్టున్నారు.

ఇప్పటికి రెండేళ్ళయింది. ఆడొచ్చినప్పుడు బట్టపాతలు తేవడం తప్ప కానీ మిగల్చనేకపోతన్నాడు. అసలక్కడా – బతుకులిలాగే వున్నాయి. దాంతో యీ యాడాది మాం బతకడఁవూ కష్టఁవై పోతోంది. తల్లిలేని పిల్లలని మా పిల్లలు ఆకలి కేడిస్తే మాయమ్మ సూసోర్సనేదు. ఆళ్ళకన్న అనుబగిస్తున్న వోళ్ళు లేరా?....... ఆ కాడికి యీళు నయం కాదా? అంటే అది వినిపించుకోదు. అదిగో ఆ కడుపు గోలల్లో పుట్టింది బాబూ యీ మంటంతా" అన్నాడు నారాయుడు.

నారాయుడు చెప్పిందాంట్లో – అంతా నిజం గాకపోయినా, చాలావరకు నిజముండాలి అనుకున్నాడు నాయుడు. కొంతసేపు పోయేక, నారాయుడే అన్నాడు.

"బాబూ! మా యమ్మని – మా యమ్మమాటా అనను. ఎఱ్ఱెప్ప పైదని పై మాటా అనను, మాకు మాయమ్మెంతో మా మరదలికి దానమ్మ అంతే అని మాయమ్మ వొప్పుకోదు. తనకు తన మనవలైనట్టే, ఎఱ్ఱెప్పకీ దాని పిల్లలు అవుతారనదు. అలాగే మా ఎఱ్ఱెప్పా – మా తమ్ముడు దానల్లుడనుకుంటాది గాని మా యమ్మ కొడుకనదు. మానుండి యిడిపోయి అల్లుడు పట్టంలో కాపరఁవెట్టాలని దానికేమూలో సిన్నమనసుంది" అని ఆగేడు నారాయుడు.

"ఓలమ్మ ఓలమ్మ!" అంటూ ఎఱ్ఱెమ్మ మాట మధ్య అందుకోబోయింది. నారాయుడామెనాపి, చెప్పుకొచ్చేడు.

"పోన్నీగ్గాపోతే, నాకను. లేకపోతే యీ యిన్నోళ్ళకే అను: ఎవరికైనా వుద్దేశం వుండొచ్చుగదా! అందుకు సెపతన్నాను.

నా నదీ ఆలోసించినాను. ఒకపాలి వూరొగ్గిపోతే అదేపోక మరి రావడం జరగదు.

ఎఱ్ఱెప్ప సూడబోతే వొంటరి మనిషి. మొగుడు సూడబోతే అవిటోడు. దాని అయినోళ్ళు కానోళ్ళు ఎప్పుడో సెల్లిపోనారు. మాఁవకో తమ్ముడున్నాడు పదఁవట. ఉన్నా లేని కిందే జమ. అందుచేత దీనిగ్గాని, దీని కుటుంబానిగ్గాని ఎప్పుడేన ఈ అల్లుడో యింకో అల్లుడో – అల్లుడే అవాల. మరింకో ఆదరవు నేదు.

మాఁ వున్నావంటె మా దరి యేరు. ఇంకో అల్లుదు రాకండానే – యీ డెల్లి పట్టంలో కూకుంటే, యెటుబోయి యెటొచ్చినా ఆలకి దారీ తెన్నూ లేదు. నాదారోల బతుక్కేవుంది బాబూ! బూఁవా? పుత్రా?... మనిసికి మనిషి సాయం. మాటకి మాట సాయం. అది కానుకోరు మా జాతి." అంటూ ఆగిపోయేడు.

అతడి ధోరణి, అతడి ఆలోచన అందరికీ నచ్చినట్టున్నా కొందరికి కనువిప్పు కాలేదు. నాయుడు గారి తీర్పుకీ, నారాయుడి తగవరితనానికీ తేడా ఒక్కొళ్ళూ గమనించలేదు. నాయుడు గ్రహించేడేమో తెలియదు.

"ఒలే! ఓ వెర్రి లంజ, ఆడిమాట లిన్నావె?" అన్నాడు ఎర్రి నుద్దేశించి నాయుడుగారు.

"తియ్యగున్నాయి" అంది ఎర్రి.

"చాప్ లంజా." నాయుడామెను చీవాట్లేసేడు. ఆ చీవాట్లు చాలించేక మరెవ్వరికి నోరు విప్పడానికి లేకపోయింది. పొద్దెప్పుడు పోయిందో, దీపాలెప్పుడు పెట్టేరో గమనించలేదు నాయుడు. కొంతసేపు అలాగే కూర్చుని ---

"అవునర్రా యీది లైటెయ్యలేదేఁవీ?" అన్నాడు.

దీపాలు పెట్టేక వరండా లైటు వేసేరుగాని, వెన్నెలుందని వాకిట దీపం వేయలేదు. టక్‌న వెలిగింది లైటు. ఒక్క పైడయ్య తప్ప అందరూ గక్కురు మన్నారు.

కొంతసేపు అక్కడున్న అందరికేసి చూసి –

"ఎంతసేపు యిలా కూచుంటారు. మీరడగ వలసింది ఏఁవన్నా వుంటే అడగండి." అన్నాడు నాయుడు.

"ఏఁ వడుగుతాంబాబు! ఏఁవడిగినా కఁయ్యిన మీదడి పోతన్నావు." అంది ఎర్రి. ఆమె గొంతులో మార్పు గమనించి నాయుడు జవాబివ్వలేదు.

మరికొంతసేపు పోయేక, బారికి ముందుకొచ్చేడు.

"ఒలే ఓలె యెర్రెమ్మ! నెగుమీ" అన్నాడు – కర్రతో పొడుస్తూ.

"ఉంగ్రోరి గండ నువ్వో తీర్పరివొచ్చినావు" కసురుకుంది ఎర్రి.

"ఆ కర్రతో ఒకటెయ్యిరా లంజకీ" అని నాయుడు కసరగా, ఎర్రెమ్మ మూలుగుతూ లేచింది.

"ఎళ్ళి నీ అల్లుణ్ణి బతిమాలి తీసుకుపో –" అని తీర్పిచ్చి, "జనే నీ పేరేం పేరు – బంగారా?" అన్నాడు బంగారితో. బంగారి ఔ నంది.

"ఈ పాలికి దానివల్ల యేం తప్పున్నా గయపచ్చుకో. మీరూ మీరూ కొట్లాడుకొని పిల్లల్నేడిపించకండి. ఇంకొక్క ముక్క గుర్తుంచుకో – నువ్వేదో దానికన్నా ఓ కూరాకు ఎక్కువ కలిగున్నావు. దాని వుసురు తగిలినా, దాని పిల్లల వుసురు తగిలినా నీకు జయం కాదు."

"బాబూ! నా వుసురు, నా పిల్లల వుసురు ఎవరికి తగలాల? అనపోయింది బంగారి. కాని ఈలోగానే నాయుడు లోపలికెళ్ళిపోయేడు.

ఆ తరువాత మామూలే. నిన్ననెప్పుడో కలుసుకోవలసిన ఆలుమగలు ఆ వేళ రాత్రి కలుసుకున్నారు.

★ ★ ★

ఆ రాత్రి తొమ్మిది గంటలకు యీడ్చి యీడ్చి తన్నిన పశువులా వున్నాడు పైడయ్య. ఆ పశువుని కుడితి గోలెం ముందు పెడితే యెలా మొరాయించు కుంటుందో అలా మొరాయించుకుంటూ కూర్చున్నాడు కంచం ముందు.

సన్ని దగ్గర కూర్చుని వడ్డిస్తోంది. ఎర్రెమ్మ పిల్లల్తోపాటు బయట కూర్చుంది.

"అమ్మీ! నాయురాలిచ్చిన పులుసొడ్డించె. ఆ దాకలో వున్నాది సూడు" అంది ఎర్రెమ్మ.

నాయురాలు – పులుసొక్కటే కాదు! అన్నం, ఆకులో కూర కూడ పెట్టింది.

అందరూ కలసొచ్చేస్తుంటే, నాయురాలు పిలుస్తోందని కబురొచ్చింది. "యెల్లెల్లు, తింటె తిట్లు తిన్నావుగాని, పండగ బువ్వెడతారు" అన్నాడు బారికి పాపయ్య.

చూస్తే, వాకిట్లో నాయురాలు లేదు. నాయుడు కుర్చీలో కూర్చున్నాడు. దగ్గిరికి పిలిచి –

"ఓ లెర్రి ముండా, నీకు తెలకుండున్నాది. నేచెప్పేమాట జాగ్రత్తగా విని అర్థం చేసుకో – ఎందుకు చెపుతున్నానో గ్రహించు'' అన్నాడు నాయుడు. ''నువు చూడబోతే పేదముండవి. వెనకా ముందు ఎవరూ లేరు. వాళ్ళు కాస్త పచ్చపచ్చగా వున్నారు. వాళ్ళని మంచి చేసుకో. వాళ్ళతో తగూలెట్టుకొని నిగ్రహించలేవు. అందుకే రాజీచేసి పొమ్మన్నాను.

ఇంకోమాట చెప్తాను విను.

ఆ గుంటడు చూడబోతే మంచివాడిలాగున్నాడు. నిడివిమీద ఆడి మనసు కరిగించుకో. పట్నంలో మెల్లిగా కాపరఁవెట్టించు. అప్పుడు నీ కూతురూ సుఖపడతాది. ఆళ్ళతో మంచిగుంటె నువ్వూ ఒక కూరాకు తెచ్చుకోవచ్చు. లేదా కాలం కలిసొస్తుందంటే, ఒకర్నో ఇద్దర్నో పిల్లల్నక్కడికి పంపు. ఇక్కళ్లా కాదక్కడ. ఏటికేడాదీ పనులుంటాయి. ఆడతోడుంటే ఆ పెద్దది కూడా కూలీనాలీ చేసుకోవచ్చు. ఆడంటాడుగాని అందరూ యిక్కడే పడుంటే ఎవరికీ కడుపునిండదు. కడుపెప్పుడు నిండదో కాని బుద్ధులప్పుడు తప్పవు."

అంటూ మంచిగా పని జరిగించుకోమని మరోసారి బోధించి నాయురాలిని కేకేసేరు. ఇంత అన్నం, యింత కూరా – ఇంట్లో యేఁవేం మిగిల్తే అవన్నీ పెట్టమన్నారు.

పైడయ్య ఇంటికెళ్ళి తిరిగొచ్చేలోగా చిన్న పిల్లలికి తినబెట్టి పడుకోమంది. పైడయ్య రాగానే సన్నిని వడ్డించమంది.

తల్లి చెప్పకముందే సన్ని పులుసొడ్డించింది. కూరముక్క ఒకటి రుచిచూసి పులుసు కలుపుతున్నాడు పైడయ్య. పరధ్యానంగా వున్నవాడు ఎఱ్ఱెమ్మ మాటల్తో యీ లోకంలోకి వచ్చేడు. వచ్చేక అలా అన్నం కలుపుతున్నాడు గాని ముద్ద నోటి కెత్తడం లేదు.

"ఏం ఆకల్నేదా?" అంది సన్ని.

లేకేం? వుందన్నాడు పైడయ్య.

"మరేం అలా కూకున్నా" అంది సన్నెమ్మ.

పైడయ్య ముద్దేకాదు. మొహం కూడా యెత్తలేదు. కొంతసేపు చూసి –

"ఈ కోకెంతకి కొన్నా?" అంది సన్నెమ్మ.

పైడయ్య అప్పటికీ తలెత్తలేదు. కాని రెండు ముద్దలు నోట పెట్టుకున్నాడు. ఆ తరవాత –

"నా కిది దిగడం నేదు –" అన్నాడు సన్నితో.

"పో నొగ్గీ" అంది జాలిగా.

చెయ్యి కడుక్కోడానికి గిన్నెకోసం లేచింది. పైడయ్య గొప్ప సందిగ్ధంలో వున్నాడు.

అన్నం తినకపోతే ఆకలేస్తుంది. ఆ కూడు తినబోతే వెపరిస్తోంది.

"మోచేతి కూడు" – అనే ఎంచితే – ఎంచడానికి లేనిదేఁ వుందా గుడిసెలో?

సన్ని కంచం తెచ్చి పక్కను పెట్టింది. పైడయ్య చెయ్యి కడిగేసుకున్నాడు. ★

(1969 మే, జూన్ ఆంధ్రజ్యోతి వారపత్రిక)